# వార్త

ఆదివారం

12 మే, 2024




## ఈ పాపం ఎవరిది?






## అవధుల్లేని అమ్మ ప్రేమ

తారాతీరం

# 'స్పిరిట్' సినిమాలో ఇద్దరు హీరోయిన్లు!




ప్రభాస్ హీరోగా ఒకవైపు 'కల్కి', మరోవైపు 'రాజా సాబ్' సినిమాలు రూపొందుతున్నాయి. ఆ తరువాత ఆయన సందీప్ రెడ్డి వంగతో కలిసి సెట్స్‌పైకి వెళ్లనున్నాడు. డిసెంబరు నుంచి 'స్పిరిట్' సినిమా రెగ్యులర్ షూటింగు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలు ఉండనున్నారు. ఒక పాత్ర కోసం కియారా అద్వానీని, మరో పాత్ర కోసం నయనతారను సంప్రదిస్తున్నట్లు సమాచారం. దక్షిణాది ప్రేక్షకులలో కియారాకు మంచి క్రేజ్ ఉంది. ఇక నయనతారకి ఇక్కడున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పని లేదు. అందువల్ల ఈ సినిమాపై అందరికీ భారీ అంచనాలు ఉన్నాయి.



# 'హరిహర వీరమల్లు' డిసెంబరులో విడుదల?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన చిత్రాల్లో దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు' ఒకటి. కొత్తగా సినిమా బాధ్యతలు యువ దర్శకుడు జ్యోతికృష్ణ చేపట్టగా సినిమాపై మరింత ఆసక్తి ఏర్పడింది. ఈ చిత్రం డిసెంబరులో విడుదల కానున్నట్లు సమాచారం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. బాబీ డియోల్ మొదలైనవారు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.



ఆదివారం వార్త
12 మే, 2024

## మంచి ముత్యాలు

ప్రపంచం మిథ్య అని తెలుసుకున్న రోజున
కోరికలు అదృశ్యమైపోతాయి.


- భగవద్గీత

## విషయ విశేషం

నీళ్లట్యాంకు చెట్లు... 4
'సంఘీ'భావం....5
పోలింగ్ శాతం పెరగాలి
కవర్ స్టోరీ..6
ఈ పాపం ఎవరిది
సుర్రుమంటున్న ఎండలు...10
ఈవారం కవిత్వం..12
ప్రేమను కన్న అమ్మ
అవధుల్లేని అమ్మ ప్రేమ..14
కథ.. 20
అనురాగ క్రమం
సాహిత్యం..23
వందేళ్ల తెలుగు కథకు వందనం
పంటినొప్పి-దేశభక్తి...24
పంచవటి..25
రావణుని పూజించే ఆలయాలు...26
వసారాలు ఎటువైపు ఉండాలి?...29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### పంటికీ..గుండెకీ ముడి!



దంతాల సమస్యకి హృద్రోగానికీ దగ్గర సంబంధం ఉందని చెప్పేందుకు మరో బలమైన సాక్ష్యాన్ని ప్రపంచం ముందు పెట్టారు జపాన్ శాస్త్రవేత్తలు. చిగురు వాపో-పూతో కారణం ఏదైనా సరే అక్కడ ఏర్పడే బ్యాక్టీరియా నేరుగా గుండెనాళాల్లోకి ప్రవేశించి హృద్రోగానికి దారితీస్తోందట. ఈమధ్య జపాన్ శాస్త్రవేత్తలు గుండె అవసరానికన్నా వేగంగా కొట్టుకునే అట్రియల్ ఫైబ్రిలేషన్ సమస్య ఉన్న 288 మంది రోగుల్ని పరిశోధనకి తీసుకున్నారు. వీళ్లందరికీ చిగురువాపు సమస్య కూడా ఉంది. ఈ 288 మంది మూణ్నెళ్ళ తర్వాత తమ చిగురువాపు సమస్యకీ చికిత్స తీసుకున్నారు. వీళ్లందరినీ ఆరునెలల తర్వాత మళ్లీ పరిశీలించారు జపాన్‌లోని హిరోషిమా వర్సిటీకి చెందిన ఈ శాస్త్రవేత్తలు. ఆ రోగుల్లో 24శాతం మందికి హృద్రోగ సమస్య తిరగబెట్టిందట. వాళ్లలో 90శాతం మందికి తీవ్ర చిగురువాపు సమస్య ఉన్నాసరే దాన్ని నిర్లక్ష్యం చేసినవాళ్లట. అదే చిగురువాపు సమస్యకి చికిత్స తీసుకున్నవారిలో 60శాతం మంది హృద్రోగాన్ని పూర్తిగా జయించారట. ఈ ఫలితాలన్నీ బట్టి చిగురువాపు సమస్యకీ హృద్రోగాలకీ ఉన్న సంబంధం మరోసారి రుజువైందంటున్నారు శాస్త్రవేత్తలు. రోజూ రెండుసార్లు దంతధావనం చేయడం లాంటి చిన్నచిన్న జాగ్రత్తలతోనే పెద్ద సమస్యల్ని అధిగమించవచ్చని చెబుతున్నారు.

### జోక్స్..జోక్స్..


రవి: కవరుకు స్టాంపులెన్నంటించాలి సార్?
పోస్ట్‌మేన్: బరువును బట్టి స్టాంపులుంటాయి.
రవి: అయితే యాభైకేజీల బరువుకు సరిపోయే స్టాంపులివ్వండి సార్.
పోస్ట్‌మేన్: నోరెళ్లబెట్టాడు..

...

అనసూయ: ఏం వదినా అన్నయ్యకు మాటిమాటికి ట్రాన్స్ ఫర్ అవుతుంది ఎందుకని?
సావిత్రి: రౌడీల జోలికి వెళ్లకండి అంటే మాట వింటేగా..


- వైదా ఈశ్వరరావు

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



**ధరలు పెరుగుతున్నాయని తెలియగానే సంవత్సరానికి సరిపడా బియ్యం, కందిపప్పువంటి సరుకులను కొని, దాచుకోవడం తెలిసిందే. మరి వేసవికాలం నీటికోసం వానాకాలంలో వచ్చే నీటిని దాచుకోవడం సాధ్యమేనా! సాధ్యమేనని నిరూపిస్తున్నాయి ఆదేశపు చెట్లు. ఆఫ్రికా ఖండంలోని మడగాస్కర్‌లాంటి దేశాల్లో**

# నీళ్లట్యాంకు చెట్లు



**వానాకాలంలో ఈ చెట్ల తొర్రలో నీటిని పోసి దాచిపెడతారు. ఎండాకాలంలో తీసి వాడుకుంటారు.**

బేనోబాబ్ ఓ ఎడారి చెట్టు. మడగాస్కర్ సహా ఆఫ్రికాలోని 32 దేశాల్లో పెరుగుతుంది. వేల సంవత్సరాలపాటు బతుకుతుంది. ఆరువేలేండ్ల నాటి చెట్టు కూడా ఇప్పటికీ ఈ ప్రాంతంలో ఉంది. దాదాపు వంద అడుగుల ఎత్తు వరకూ ఇవి పెరగగలవు. ఈ చెట్టు చుట్టుకొలతే దాదాపు 1,20,000 లీటర్ల నీటిని ఇది తన కాండంలోని స్పాంజ్‌లాంటి నిర్మాణం సాయంతో నిల్వ చేసుకుంటుంది. అందుకే దీని కాండం పెద్ద బాటిల్ ఆకృతిలో కనిపిస్తుంది. బాటిల్ ట్రీగానూ దీన్ని పిలుస్తారు. వేల సంవత్సరాలు బతికే ఇవి డొల్లగా మారిపోతుంటాయి. దాని లోపల జంతువులతో పాటు కొన్ని చోట్ల మనుషులూ తలదాచుకుంటారు. దీని ఆకులు, పండ్ల మొదలు బెరడు వరకూ అన్నీ పనికొచ్చేవే. అందుకే దీన్ని 'ట్రీ ఆఫ్ లైఫ్'గా పిలుస్తారు. అక్కడి జనం దీని చుట్టుపక్కల ఇండ్లు కట్టుకుంటారు.



## మంచినీటి కోసం

ఉష్ణమండల ప్రాంతమైన ఆఫ్రికాలోని చాలాదేశాల్లో వేసవిలో నీటికి కటకటగానే ఉంటుంది. అక్కడి ఆదివాసీలు బేవోబాబ్ చెట్ల తొర్రల్లో వానాకాలం నాటి నీరు..ఎండాకాలం వచ్చినా స్వచ్ఛంగా ఉండటాన్ని గమనించారు. ఏమాత్రం దుమ్మూధూళీ కూడా చేరకపోవడంతో వాటిని తాగి చూశారు. అంతేకాదు, ఈ తొర్రల్లో నీరు నిల్వ ఉన్నా చెట్టు లోపలి భాగం కుళ్లలేదని గుర్తించారు. దీంతో ఆ చెట్టుకు పెద్ద తొర్రలు చేసి, వానాకాలంలో అందులో నీటి నిల్వ ప్రారంభించారు. కొన్నివేల లీటర్ల నీళ్లు ఈ చెట్టుకాండంలో పడతాయి. నీళ్లు పోయడం పూర్తయ్యాక లోహపు రేకు సాయంతో దీన్ని మూసేస్తారు. చెట్టులోపలి భాగం ఈ నీటిని శుద్ధి చేస్తుంది. అంతేకాదు, తొలిచాక ఏర్పడ్డ కొత్త పొర నీటిని నిల్వ ఉంచేందుకు తోడుగులా పనిచేస్తుంది. మడగాస్కర్‌లోని మహాఫలి పీఠభూమిలోని మహాఫలి, యాంటంద్రాయ్ జాతుల్లోని సుమారు 20వేల మంది ఇలాంటి నీటివసతి మీదే బతుకుతున్నారు. ఇక్కడి గ్రామంలో సుమారు 500మంది జనాభాకు 300 బొనోబాబ్ చెట్లున్నాయి. ఒక్కో కుటుంబం కొన్ని చెట్లను తీసుకుని అందులో నీటిని దాచుకుని రక్షిస్తుంటుంది. ఈ చెట్లకు వీళ్లు పేర్లు కూడా పెట్టుకుంటారు. సహజంగా నీళ్లు దొరికే వసతులన్నీ అడుగంటాక, వీటిని తెరిచి వాడుకుంటారు. మొత్తంగా ఈ చెట్లు అక్కడి వాళ్లకి మంచినీళ్ల ట్యాంకులుగా పనికొస్తున్నాయి.

## 'సంఘీ' భావం



# పోలింగ్ శాతం పెరగాలి

దేశవ్యాప్తంగా పార్లమెంటుకు సాధారణ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంటుతో పాటు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల 13వ తేదీన ఉంది. తెలంగాణలో గతేడాది అసెంబ్లీ ఎన్నికలు పూర్తి కావడంతో ప్రస్తుతం 17 పార్లమెంటు స్థానాల్లో మాత్రమే ఎన్నికలు జరుగుతున్నాయి. పోలింగ్ గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థులు, పార్టీ నేతలు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఎన్నికల అధికారులు ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నారు. ప్రశాంతవాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు తగిన సౌకర్యాలు కల్పించడంలో నిమగ్నమయ్యారు. అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణకు భారీ మొత్తంలో ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. ఓటర్లు ప్రశాంతవాతావరణంలో ఎలాంటి ఒత్తిడులకు, భయాలకు లోనుకాకుండా ఉండేందుకు బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఓటర్లు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటేనే తగిన ప్రయోజనం ఉంటుంది. సుమారుగా గత నాలుగైదు ఎన్నికల నుంచి ఓటింగ్ శాతం క్రమంగా పెరుగుతోంది. అయితే కొత్తగా నమోదు అవుతున్న ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఓటింగ్ శాతం పెరగడం లేదు. 18 సంవత్సరాలు పైబడిన వారికి ఓటరు గుర్తింపు కార్డు లభిస్తుంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం యువతలో చైతన్యం పెరుగుతూ ఉండటంతో ఓటర్లుగా నమోదు చేసుకునే విషయంలో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. అయితే ఈ ఉత్సాహం ఓటింగ్ సమయంలో కొరవడుతోంది. పోలింగ్ రోజున ఇచ్చే సెలవు రోజున సరదాగా గడపడానికో లేక తమ స్వగ్రామాలకు పయనం కావడానికో శ్రద్ధ చపించడంతో ఆశించిన మేరకు పోలింగ్ శాతం పెరగడం లేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన తరువాత ప్రభుత్వ అధికారులు పోలింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఎలక్షన్ రన్, శిబిరాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. అయితే పోలింగ్ నాడు మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. పోలింగ్ కేంద్రాలకు మందకొడిగా ఓటర్లు వస్తున్నారు. ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలి అన్న తపన ఓటర్లలో కనిపించడం లేదు. విద్యాభ్యాసం తక్కువగా ఉండే పల్లెల్లో పోలింగ్ శాతం పెరుగుతుంటే పట్టణ ప్రాంతాల్లో అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. పట్టణాల్లో ఓటింగ్ పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదు. నిత్యం బిజీబిజీగా జీవనాన్ని గడిపే నగర పౌరులు ఒకరోజు సెలవు వస్తే సేద తీరాలన్న ధ్యాసలో ఉంటున్నారు. సెలవు ఎందుకు ఇచ్చారన్న విషయంపై దృష్టి సారించడం లేదు. మరోపక్క నగరాల్లో చాలా శాతం వరకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ఉద్యోగ వ్యాపారాలు చేసుకునే వారు అధికంగా ఉంటారు, సెలవు రాగానే తమ స్వగ్రామం వెళ్లాలన్న తపన అధికంగా ఉంటుంది. ప్రధానంగా ఈసారి ఎన్నికలు మే 13న వచ్చాయి. ఆ రోజు సోమవారం. శనివారం, ఆదివారం రెండు రోజులు వరుసగా సెలవులు వస్తాయి. దానికి అదనంగా పోలింగ్ కారణంగా సోమవారం కూడా సెలవు దొరుకుతుంది. దీనితో మూడు రోజులు తమ స్వగ్రామాల్లో గడుపుదామని ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పైగా ఇటు శుక్రవారం గాని, అటు మంగళవారం కాని సెలవు పెడితే ఏకంగా నాలుగురోజుల సెలవు లభిస్తుంది. సెలవులను సరదాగా గడుపుదామని విద్యావంతులు సైతం ఎదురుచూస్తున్నారు. అయితే తమ భవిష్యత్తును, దేశ అభ్యున్నతికి ముడిపడి ఉండే అత్యంత కీలకమైన ఎన్నికల విషయంలో పూర్తిస్థాయి నిర్లక్ష్యం చూపిస్తున్నారు. ఎన్నికల ఓటింగ్ శాతం పెరగడం వల్ల సమర్థవంతులైన వారికి, పార్టీలకు విజయావకాశాలు ఏర్పడతాయి. ఉదయం సమయంలో వెళ్లి ఓట్లు వేసి వస్తే ఇక ఆరోజంతా విశ్రాంతి తీసుకోవచ్చు. పైగా దీనివల్ల తమ ఓటు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉండదు. అదేవిధంగా ఓటు హక్కు వినియోగించుకోవడం అన్నది అత్యంత కీలకమైన బాధ్యత అన్న విషయాన్ని మరిచిపోతున్నారు. ముఖ్యంగా ఐటి సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు సర్వేలలో తేలింది. ప్రస్తుతం సుమారు 65 నుంచి 70 శాతం మధ్యలో పోలింగ్ శాతం నమోదు అవుతోంది. అది కూడా మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగుతోంది. సాయంత్రం పోలింగ్ మరో గంటలో ముగుస్తుందనగా అనూహ్యరీతిలో శాతం పెరుగుతోంది. మధ్యాహ్నం మూడు గంటల వరకు కేవలం 35 నుంచి 40 కూడా దాటని పోలింగ్ ఒక్కసారిగా చివరి గంటలో ఎందుకు పెరుగుతుందో ఆలోచిస్తే సమాధానం తెలుస్తుంది. మధ్యాహ్నం మూడు, నాలుగు గంటల తరువాత ఓటర్లు తగ్గిపోతారు కాబట్టి అక్రమాలకు కొన్ని పార్టీలు తెరలేపుతాయి. ఎక్కడ బలం ఉందో ఆ పోలింగ్ కేంద్రంలో ఎక్కువ అక్రమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఆపాలంటే అధికారులకు సాధ్యం కాదు. ఉదయాన్నే 11 గంటలలోగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటే మధ్యాహ్నం దాటిన తరువాత దొంగ ఓట్ల వ్యవహారాన్ని అరికట్టవచ్చు. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో కనీసం 80 శాతం వరకు పోలింగ్ పెరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉంది.


– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# ఈ పాపం ఎవరిది?

కవర్‌స్టోరీ

సండే డెస్క్

**చదువుల ఒత్తిడులు విద్యార్థులపై అనేక రకాలుగా పనిచేస్తున్నాయి. వారిలో చైతన్యాన్ని, విజ్ఞానాన్ని పెంచవలసిన, మనోవికాసాన్ని పంచవలసిన చదువులు హఠాత్తుగా వారు బలిపీఠం ఎక్కడానికి కారణమవుతున్నాయి. అయితే ఆ నేరం పూర్తిగా చదువులదేనని కూడా చెప్పలేం. అనుసరించే విధానాలది. మార్కుల విధానం, బోధనావిధానం, మొత్తగా విద్యావిధానంలోని లోపాల వల్లనే విద్యార్థులు ఇలా ప్రాణత్యాగాలకు పాల్పడుతున్నారనిపిస్తుంది. కాలదోషం పట్టిన విధానాలను అనుసరించచడం వల్లనే పసిమొగ్గలు విరయకుండానే వాడిపోతున్నాయి. భవిష్యత్తును సుసంపన్నం చేసుకోవలసిన దశలో విద్యార్థులు ప్రాణాలు తీసుకొంటున్నారంటే అందుకు బాధ్యత ఎవరిది? ఆ పాపం ఎవరిది! ఇప్పటికైనా అందరూ ఆలోచించాల్సిన తరుణమిది.**



**చదువు..చదువు..** ఉదయం లేచిన దగ్గర్నుంచి, రాత్రి పడుకునేవరకు అదే లోకం. పరీక్షలు, మార్కులు, ర్యాంకులు, టాపర్లు విద్యార్థులకు ఈపదాలు తప్ప మరొకటి తెలియవేమో! తల్లిదండ్రుల తపన, పిల్లల ఆశయాలు, స్కూళ్లు, కాలేజీలు, కోచింగ్‌సెంటర్లకు ఫీజుల దాహం..వెరసి ఇవన్నీ విద్యార్థుల మానసిక ఒత్తిడికి గురిచేస్తూ, వారి జీవితాలను బలితీసుకుంటున్నాయి. ఒకప్పుడు చదువుచుట్టూ డబ్బు తిరిగేది, నేడు డబ్బుచుట్టూ చదువు తిరుగుతోంది. చదువు'కునే' స్థాయి నుంచి చదువు'కొనే'స్థాయికి విద్యాప్రమాణాలు దిగజారిపోయాయి. విద్య ఒక లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. వేలు, లక్షలు ఫీజుల రూపంలో చెల్లించే తల్లిదండ్రుల మనసు పిల్లలకు అర్థంకాక..పెరుగుతున్న పోటీని తట్టుకోలేక, అధ్యాపకులు, విద్యాసంస్థల యాజమాన్యాల ఒత్తిడిని భరించలేక ఎవరికీ చెప్పుకోలేని ఒంటరితనంతో తప్పుడు నిర్ణయాలు తీసుకుని, అర్థాంతరంగా ఈలోకాన్ని విడిచిపెడుతున్నారు. కన్నవారికి కడుపుకోతను మిల్చుతున్నారు. అమ్మానాన్నలను ఒప్పించలేక, అధ్యాపకులను మెప్పించలేక ఓడిపోతున్న విద్యాకుసుమాలు రాలిపోతున్నాయి.

ఓ పాతికముప్పై సంవత్సరాల క్రితం చదువంటే ఆడుతూపాడుతూ సాగేది. చదువు ఎంతో అహ్లాదకరంగా సాగేది. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యంశ్యాలతోపాటు సామాజికాంశాలను బోధించేవారు. నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ, దేశభక్తిని, సమాజంలో యువత పాత్రను నూరిపోసేవారు. చదువులో వెనుకబడితే బెత్తంతో కొట్టేవారు. ఎన్నోరకాలుగా దండించేవారు. అందుకు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కొట్టమనే చెప్పేవారు. టీచర్లు పిల్లల్ని ఎంత దండించినా విద్యార్థులు కూడా ఇదంతా తమ బాగుకోసమేనని అనుకునేవారు. రానురాను విద్య వ్యాపారమైంది. విద్యార్థులను దండించే స్వేచ్ఛ లేదు. ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునేవరకు పోటీతో చదివిస్తున్నారు. పోటీతో చదువుకోవడం వేరు, పోటీతో చదివించడం వేరు. ఒకటి ఇష్టమైతే, రెండోది బలవంతం. విద్యాసంస్థల మధ్య మార్కులు, ర్యాంకుల పోటీ విపరీతంగా పెరిగిపోతున్నది. తల్లిదండ్రుల తపన, పిల్లల ఆశయాలు, స్కూళ్లు, కాలేజీలు, కోచింగ్‌సెంటర్ల ఫీజుల దాహం ఉన్నత విద్యపై విపరీతమైన ప్రభావం చూపుతున్నది. దీంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. భవిష్యత్తులో దేశాభివృద్ధికి భాగస్వాములు కావాల్సిన దివ్వెలు అర్థాంతరంగా ఆకస్మికంగా ఆరిపోతున్నాయి. కని పెంచినవారి ఆశలను చిదిమేస్తూ కుటుంబాల్లో అంధకారాన్ని నింపుతూ కనుమరుగవుతున్న ఈ విద్యా దీపాల వెనుక ఎన్నో కారణాలు పైకి కనిపిస్తున్నా ఒత్తిడిని తట్టుకోలేకపోవడమే ప్రధాన కారణమనేది కాదనలేని వాస్తవం. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు ఆ గర్భశోకాన్ని

భరించలేక అనారోగ్యంపాలై తనువు చాలిస్తుంటే మరి కొందరు బలవంతపు చావులకు కూడా వెనుకాడడం లేదు.



## ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు

ఇటీవల పదోతరగతి, ఇంటర్ పరీక్షాఫలితాలు వెలువడ్డాయి. తెలుగురాష్ట్రాల్లో పరీక్షాఫలితాలు ప్రకటించిన రోజు దాదాపు 10మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాధాకరమైన విషయం ఏమంటే ఓ విద్యార్థిని ఫెయిల్ అవుతాననే భయాందోళనకు గురై ముందురోజు రాత్రే బలవన్మరణానికి పాల్పడింది. కానీ ఫలితాలు వచ్చిన తర్వాత ఆమె నాలుగు వందల ఒక్క మార్కులతో ఫస్ట్ క్లాసులో పాసైంది. మొన్నా మధ్య తమిళనాడులో మెడికల్ కాలేజీ ప్రవేశ అర్హత పరీక్ష కోసం నీట్ పరీక్షల్లో రెండు సార్లు ప్రయత్నం చేసి విఫలమై మూడోసారి వస్తుందో లేదో అనే అనుమానంతో పంతొమ్మిదేళ్ల జగదీశ్వర్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఫొటోగ్రాఫర్ వృత్తిలో ఉన్న తండ్రి చంద్రశేఖర్ ఇంటికి చేరుకునేసరికి కుమారుడు చనిపోయి ఉండడం చూసి జీర్ణించుకోలేకపోయాడు. కుమారుడు నాలుగేళ్ల వయసులోనే తల్లిని కోల్పోయాడు. ఒక్కగానొక్క కొడుకుకు తల్లీదండ్రీ అన్నీ తానై అల్లారుముద్దుగా పెంచుకొని డాక్టర్ చేయాలని కలగన్నాడు. ప్రైవేట్ సంస్థలో శిక్షణ పొందిన ఆ యువకుడు రాత్రింబవళ్లు కష్టపడి చదివి ప్రయత్నించినా వస్తుందో రాదో అనే అనుమానంతో ఉరి వేసుకొని చనిపోయాడు. అంత్యక్రియలు పూర్తి చేసిన తర్వాత కుమారుడి మరణాన్ని దిగమింగుకోలేక చంద్రశేఖర్ కూడా అదే రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ జిల్లా నడికూడ మండలం రామకృష్ణాపూర్‌లో గాజ కుమారస్వామి (47) కుమార్తె శ్రీవిద్య (19) గతేడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయింది. ఈ ఏడాది తిరిగి ఇంటర్ పరీక్షలు రాయగా మళ్లీ ఫెయిలవ్వడంతో మనస్తాపం చెందిన శ్రీవిద్య ఈ నెల 7వ తేదీన పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తన కుమార్తె బతుకుతుందో లేదోనన్న బాధతో తండ్రి కుమారస్వామి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని గలియాబాయి తండాలో ఓ విద్యార్థి నీట్ బాగా రాయలేదని ఆత్మహత్యకు ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం పాల్పడ్డాడు. ఇంటర్‌లో 894 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు.

గడిచిన పదేళ్లుగా దేశవ్యాప్తంగా, తెలుగు రాష్ట్రాల్లోనూ విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఏడాదికి దాదాపు ఏడువేలమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశంలో ప్రతి 42 నిమిషాలకి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్రవిచారకం. అంటే సగటున రోజుకి ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఆత్మహత్యలు 2017 నుంచి 2022 వరకు 32శాతం పెరుగుదలగా ఉంది. రాజస్థాన్‌లోని కోటాలో ఈ ఏడాది ఇప్పటివరకు 25మంది విద్యార్థులు బలవన్మరణం చేసుకున్నారు. మనదేశంలో ఐఐటి, ఎన్ఐటి, ఎయిమ్స్, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు తదితర ఉన్నత విద్యాసంస్థల్లో గడిచిన ఐదేళ్లలో 98మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు అంటే ఈ సమస్య ఎంత తీవ్రతరమవుతోందో అర్థం చేసుకోవచ్చు. 19 నుంచి 29ఏళ్లలోపు వయస్సు వారిలో ప్రాణాలను తీసుకోవాలనే ఆలోచనలు ఎక్కువగా ఉండటం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. దేశంలో 2018-2023 వరకు ఐఐటిల్లో చదువుతున్న వెరికల్లాంటి ముప్పై మూడు మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో విద్యార్థుల బలవన్మరణాలు ప్రధాన మంత్రి నరేంద్రమోడీని సైతం కదిలించాయి. పరీక్షల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలని తెలియచేస్తూ 'ఎగ్జామ్స్ వారియర్స్' అనే పుస్తకాన్ని ప్రధానే స్వయంగా రాశారు. మార్కుల కన్నా తమకు సహజంగా ఉండే నైపుణ్యాలపై దృష్టి ఆసరించాలని ఆ పుస్తకంలో విశ్లేషించారు.



ఈ బలవంతపు చావులకు కారణాలెన్నో ఉన్నాయి. కారకులెందరో ఉన్నారు.

## కోటాలో పెరుగుతున్న ఆత్మహత్యల సంఖ్య

రాజస్థాన్‌లోని కోటాలో ఇటీవల కాలంలో విద్యార్థుల ఆత్మహత్య కేసులు బాగా పెరిగాయి. ఇక్కడ ఏటా దాదాపు రెండు లక్షలమంది విద్యార్థులు ఆయా కోచింగ్ సెంటర్లలో చేరుతున్నారు. అంతేకాదు ఇక్కడ ప్రఖ్యాతిగాంచిన ఇంజినీరింగ్, మెడికల్, ఇతర విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. అనుభవం, నైపుణ్యం ఉన్న లెక్చరర్లు కోచింగ్ సెంటర్లలో ఉండడంతో అనతికాలంలోనే కోటాలోని విద్యాలయాలు, కోచింగ్ సెంటర్లు ప్రఖ్యాతినొందాయి. లాంగ్‌టర్మ్ కోచింగ్‌లు, షార్ట్‌టర్మ్ కోచింగ్ సెంటర్లు ఎంతో పాపులర్ అయ్యాయి.



దీంతో ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య పెరిగిపోతున్నది. కేవలం కోచింగ్‌లకే లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టడంతో విద్యార్థుల్లో తీవ్ర ఒత్తిడి పెరిగిపోతున్నది. తల్లిదండ్రులకు దూరంగా ఉండడం ఇంటిపై బెంగ, కన్నవారిని కాదనలేక, సిలబస్ పూర్తి చేయలేక తీవ్రమైన మానసిక అలజడికి గురవుతున్నారు.

## వైఫల్యం ఎక్కడ?

మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయి. ప్రైవేట్ విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు పిల్లల చదువులకై తల్లిదండ్రుల ఆరాటం, ఆసక్తి, ఆత్రుత, అంతకంతకు పెరిగి వారిని చదివించుకోవడం ఒక్కటే జీవిత లక్ష్యంగా మారింది. అందుకోసం తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలు చూస్తుంటే విస్తుపోవాల్సి వస్తుంది. పిల్లల చదువుల కోసం కడుపు చేత పట్టుకొని పట్టణాలకు, నగరాలకు వలస వచ్చి చిన్నా చితక ఉపాధితో జీవనం సాగిస్తున్నారు. మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. కేవలం కార్పొరేట్ కాలేజీల్లో చదివితేనే తాము కోరుకున్న కాలేజీల్లో కావాల్సిన కోర్సుల్లో సీటు దొరుకుతుందనే ప్రచారం పెరిగిపో యింది. మరోకపక్క ఇంజినీరింగ్, ఐఐటి, మెడికల్ వంటి ఉన్నత విద్యను అభ్యసిస్తేనే పిల్లలకు వెంటనే ఉద్యోగాలు దొరకడమో, లేక విదేశాల్లో జీవనోపాధి లభించడమో చూస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు కూడా అలాంటి సుస్థిర జీవన సుఖాన్ని పొందాలని ఆరాటంలో పడుతున్న వ్యయప్రయాసలు అన్నీ ఇన్నీ కావు. ఈ బలహీనతలను సొమ్ము చేసుకోవడానికి కొన్ని కాలేజీలు వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది.

## పిల్లల మనసును గ్రహించలేకపోతున్నాం

ప్రధానంగా తల తాకట్టు పెట్టి అప్పో సప్పో చేసి లక్షలాది రూపాయలు తల్లిదండ్రులు తమ భవిష్యత్తు కోసం ఫీజుల రూపంలో చెల్లించడంతో పాటు వారు తీసుకొంటున్న శ్రద్ధాసక్తులు, అన్ని గమనిస్తూ వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనసుకెక్కపోవడంతో మానసిక సంఘర్షణకు గురై అటు తల్లిదండ్రులకు తాము ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు చెప్పి, ఒప్పించలేక ఇటు బోధన చేసిన అధ్యాపకులతో మనస్సు విప్పి తమ బాధలను వివరించలేక ఒత్తిడిని తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు. అయితే ఈ విషయం కొందరు అధ్యాపకులకు కొన్ని సందర్భాల్లో అర్థమైనా యాజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలేకపోతున్నారు. దీనికితోడు తమకు మార్కులు తక్కువ వచ్చాయని, లేక సీటు రాలేదనే బాధ కన్నా తోటివారితో పోల్చుకుంటూ ఏమనుకుంటారో, తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఎలా స్పందిస్తారో అనే భయాందోళనలు కూడా వీరిని ఆత్మహత్యల వైపు నడిపిస్తున్నాయి. ఇలా బట్టీ పట్టి ర్యాంకులు సంపాదించిన వారిలో కొందరికి ఐఐటి లాంటి సంస్థల్లో ప్రవేశం దొరికినా అక్కడ బోధనా పద్ధతులు, విధానాల్లో ఇమడలేకపోతున్నారు. ఈ చావులకు ఇలాంటి కారణాలెన్నో ఉన్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో 2021 రిపోర్టు ప్రకారం 18ఏళ్లలోపు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో ఎనిమిదిశాతం మంది పరీక్షల్లో ఫెయిల్ అయినవారు ఉన్నారు. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి కారణాలతో తనువు చాలించుకుంటున్నారు.

## ఆందోళన కలిగిస్తోన్న మెడికల్ విద్యార్థుల ఆత్మహత్య

**గత ఐదేళ్లలో ఆత్మహత్య చేసుకున్న మెడికోల డేటా**

జాతీయ వైద్యమండలి రిలీజ్ చేసిన రిపోర్టు ప్రకారం భారతదేశంలో గత ఐదు సంవత్సరాలలో 119 మంది మెడికోలు ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఐదేళ్లలో 119మంది వైద్యవిద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా అందులో 64మంది అండర్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న విద్యార్థులు ఉన్నట్లు పేర్కొంది.



55మంది పిజీ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించింది. అంతేకాదు గత ఐదుసంవత్సరాలలో దేశవ్యాప్తంగా, 1,116 మంది విద్యార్థులు మెడిసిన్‌కు గుడ్‌బై చెప్పారని పేర్కొంది.

అండర్ గ్రాడ్యుయేషన్‌లో 160మంది విద్యార్థులు, పీజీ జనరల్ సర్జరీలో 114 మంది విద్యార్థులు, గైనకాలజీలో 103మంది విద్యార్థులు, ఎంఎస్ ఆర్థోపెడిక్స్‌లో 50మంది విద్యార్థులు, ఎమ్మెస్ ఈఎన్టీలో వందమంది, ఎండి జనరల్ మెడిసిన్‌లో 56మంది విద్యార్థులు, ఎండి పీడియాట్రిక్స్‌లో 54మంది, ఇతర బ్యాచ్‌లు కలిపి మొత్తం 592 మంది వైద్యవిద్యను మధ్యలోనే వదిలి వెళ్లిపోయినట్టు జాతీయ వైద్యమండలి వెల్లడించింది.

**వైద్యవిద్యార్థుల సూసైడ్‌లపై దృష్టిసారించాలి**

ఎంతో ఇష్టంగా కష్టపడి సాధించిన మెడిసిన్ కోర్సుల నుండి విద్యార్థులు ఎందుకు వదిలి వెళ్లిపోతున్నారు అన్న దానిపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. అలాగే వైద్యవిద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఎరికి కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం, కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

ఎన్సీ ఈఆర్టీ 2022లో నిర్వహించిన ఓ సర్వేలో 81శాతం

మంది విద్యార్థులు తమ ఒత్తిడి, ఆందోళనకు విద్యాసంబంధిత విషయాలే కారణమని చెప్పడం గమనార్హం. దేశంలోని విద్యార్థుల్ల 62శాతం మందికి ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలియదని నిమ్హాన్స్ సంస్థ సర్వేలో పేర్కొంది. దీనికితోడు విద్యావ్యవస్థలో విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి, తోటి విద్యార్థులతో పోటీ, తల్లిదండ్రుల ఆకాంక్షలు, ప్రేమ వ్యవహారాలు విద్యార్థులపై ప్రభావం చూపించి వారు కఠిన నిర్ణయాలు తీసుకునేవిధంగా ప్రోత్సహిస్తున్నాయని చెప్పవచ్చు.

## కరోనా ప్రభావం కూడా ఓ కారణం

కరోనా సమయంలో విద్యార్థులు సోషల్ మీడియాకి ఎక్కువగా ఆకర్షితులు కావడం కూడా వారిలో డిప్రెషన్ పెరగడానికి కారణమని పరిశోధనలు చెపుతున్నాయి. విద్యార్థుల ఆత్మహత్య తెలుగురాష్ట్రాల్లోనూ తీవ్రతరం అవడం కనిపిస్తూ ఉంది. గత ఏడాది ఇంటర్ ఫలితాల తర్వాత కేవలం వారం రోజుల్లోనే పదిమంది విద్యార్థులు బలన్మరణం పొందడం ఇందుకు నిదర్శనం. సమాజాన్ని కలవరపెడుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై దృష్టి సారించకపోతే దేశానికి వెన్నుదన్నుగా నిలిచే మానవ వనరుల సంపదను కోల్పోక తప్పదు. దీన్ని దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆత్మహత్యల నివారణ వ్యూహం రూపొందించింది. 2030 నాటికి ఆత్మహత్యలను 10శాతం తగ్గించడం దీని లక్ష్యం.

## తక్షణ చర్యలు తీసుకోకపోతే మరింత ముప్పు!

పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్యాసంస్థల వరకు సంభవిస్తున్న విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే పెనునష్టాన్ని చూడాల్సి వస్తుంది.





తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై 2001లో నీరదారెడ్డి కమిటీ ఇచ్చిన 17 సిఫార్సులను ఇంతవరకు అమలు చేయకపోవడం, ఈ విషయంపై ప్రభుత్వాల చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుంది. దేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాసంస్థల్ల ఆత్మహత్యల నివారణపై దృష్టిసారించి కొన్ని సంస్థలతో కలిపి గేట్‌కీపింగ్ శిక్షణ ఇవ్వడానికి పూనుకోవడం శుభపరిణామం.

## ఇవి చేస్తే మంచిది

- ఆత్మహత్య సంకేతాలను గుర్తుపట్టడం, తోటి వారిని నిపుణుల సాయం తీసుకునే విధంగా ప్రోత్సహించడం వంటి అంశాలపై అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు పీర్ కౌన్సిలర్ శిక్షణ ఇవ్వాలి.
- ప్రభుత్వరంగంలోనూ, ప్రైవేటు రంగంలోనూ ఉన్న మానసిక నిపుణులకు ఆత్మహత్యల నివారణ అంశలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారి సేవలను వినియోగించుకోవాలి.
- విద్యార్థులకు అతిదగ్గరగా ఉండే ఉపాధ్యాయులు, సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, పాఠశాలలోని ఉపాధ్యాయులు తదితర వర్గాల వారికి గేట్ కీపింగ్ శిక్షణ ఇవ్వాలి.
- విద్యార్థులకు సమస్య వస్తే చెప్పుకోవడానికి, దిశా నిర్దేశం చేయడానికి 24 గంటలు అందుబాటులో ఉండే హెల్ప్‌లైన్‌లను అందుబాటులోకి తీసుకురావాలి.
- ప్రభుత్వాలు, ఆత్మహత్యల నివారణ కోసం పని చేస్తున్న ఎన్జీవోస్ ఈ అంశాలపై దృష్టిసారించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించగలిగితే జాతీయ ఆత్మహత్యల నివారణ వ్యూహం లక్ష్యం సాధించడానికి మార్గం సుగమం అవుతుంది. సామాజిక సమస్యగా ఉన్న ఆత్మహత్యలు సామాజిక రుగ్మతగా మారకముందే ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సామాజికవేత్తలు తదితర అన్నివర్గాల వారు సహకరించాలి.
- అన్ని విద్యాసంస్థల్లోనూ తరచుగా మనోవైజ్ఞానిక నిపుణులతో కౌన్సిలింగ్ నిర్వహించాలి. అన్నిరకాల విద్యాసంస్థలలో ఆత్మహత్యలపై ఉన్న అపోహలు తొలగించేవిధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- విద్యావ్యవస్థలో విద్యార్థుల మార్కులకు కాకుండా మేధోపరమైన సామర్థ్యాలకు విలువ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణ, ఒత్తిడి నిర్వహణా సామర్థ్యాలపై ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు విస్తృతమైన అవగాహన కల్పించాలి.

ఏదిఏమైనా జీవితం విలువైనది. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, ఆశించిన మార్కులు రాలేదని, ఎంత చదివినా గుర్తుకు ఉండడం లేదని వంటి కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థులు ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి. క్షణికావేశంతో కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం కన్నా, మళ్లీ ప్రయత్నించడం మంచిది. లేదా ఏ సబ్జెక్టులు ఇష్టమైతే ఆ కోర్సులను తీసుకుని చదవడం మంచిది. చదువుపై ధ్యాసలేకపోతే వ్యాపారం, ఇతర వృత్తిపనులను చేసుకున్నా పర్వాలేదు. ఇష్టమైన రంగాల్లో చేరి అందులో విజయం సాధించవచ్చు. చదువు ముఖ్యమేకాని, ప్రాణం తీసుకునేంత ముఖ్యమైనది కాదు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు చదువు ఒక మెట్టు అంతేతప్ప అదే అన్ని మెట్లు కాదు. క్రీడల్లో సచిన్ ఒక లెజండర్, వ్యాపారం ముఖేష్ అంబానీ ఒక ఆదర్శం, కళా రంగంలో అమితాబ్‌బచన్, చిరంజీవి ఫేమస్..ఇలా మనకు కనిపించే వీరంతా చదువే లోకమని అనుకోలేదు. ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రవేశించి, కష్టపడ్డారు. అనుకున్న లక్ష్యాలను సాధించి, దేశానికి ఆదర్శంగా నిలిచారు. కాబట్టి బతికి మనం సాధిద్దాం. నలుగురికి మేలు చేద్దాం. ఇదే మన ఆశయం, ఆకాంక్ష కావాలి సుమా! ❑

# సుర్రుమంటున్న ఎండలు


**సమ్మర్ హీటెక్కిస్తున్నది. వేసవి ఉష్ణోగ్రతలు జనాలకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భూమి నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. ఉదయం 8గంటలు దాటితే వేసవి తాపం, ఎండ, ఉక్కపోత వెంటాడుతున్నాయి. ఒకవైపు భానుడి భగభగలు, మరోవైపు ఉక్కపోతలతో జనం నీడలను వెతుక్కుంటూ పరుగిడుతున్నారు.**



వేసవి తాపాన్ని తట్టుకుంటూనే జీవనోపాధి పోరాటాలు కొనసాగిస్తున్నారు. మారుతున్న వాతావరణ ప్రతికూలతల ఫలితంగా వడగాలులు, సూర్యప్రతాపాలు తీవ్ర ప్రజారోగ్య సమస్యలకు ఊతం ఇస్తున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకుంటూ మన పనులను చేసుకోవడానికి కొన్ని జాగ్రత్తలు, జీవనశైలి మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మే మాసంలో ఎండల తీవ్రత మరింత ప్రమాదకరంగా ఉంది కాబట్టి పలు చిట్కాలు తెలుసుకొని తగు జాగ్రత్తలు పాటించాలి.

### ఎండలకు వీలైనంత దూరంగా ఉందాం

శరీరంపై నేరుగా మధ్యాహ్నవేళ సూర్యకాంతి పడకుండా ఉండేలా గొడుగులు, చెట్టు నీడలు, కృత్రిమ పైకప్పులు, బైకులపై ప్రయాణించే వారు చర్మాన్ని బట్టలతో కప్పుకోవడం, ముఖాన్ని కాటన్ చేతిరుమాలు లేదా టవల్‌తో కప్పుకోవడం, తలపై టోపి పెట్టుకోవడం, చల్లని ప్రదేశాల్లో ఉండే ప్రయత్నాలు చేయాలి. స్వచ్ఛమైన గాలి ప్రవహించే గదుల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. శరీరంపై నేరుగా అతినీలలోహిత కిరణాలు కలిగిన సూర్యరశ్మిపడితే హీట్‌స్ట్రోక్‌కు చర్మం ముడతలు, పొడిబారి పగిలిపోవడం, వేడితో అలసటలాంటి అసౌకర్యాలు కలుగుతాయి. ఎండ నుంచి ఇండ్లలోకి రాగానే ముఖం, కాళ్లు, చేతులు, శరీరాన్ని చల్లని నీటితో కడుక్కోవడం పాటిస్తే రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుందని తెలుసుకోవాలి. ఇంటికి రాగానే ఐస్‌బ్యాగ్‌తో ముఖం, మెడ, చేతులను రుద్దుకోవాలి. ఎండ నేరుగా ముఖం, తలపై పడకుండా చూసుకోవాలి. మధ్యాహ్న వేళ వంట చేయడం మానేయాలి. వంటగదిలో ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఆన్‌లో ఉంచాలి.



### నీటిని ఎక్కువగా తాగాలి

డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి

ఎండకు మంచి నీరే దివ్యౌషధం అని మరువరాదు. ఎండ, వడగాలుల్లో పని చేసినపుడు చెమట రూపంలో శరీరంలోని నీటిశాతం తగ్గిపోయి ప్రమాదకర డీహైడ్రేషన్ (నిర్జలీకరణం) సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఎండల్లో తిరుగుతూ కెఫీన్ రసాయనం అధికంగా ఉన్న టీ తాగడం మంచిది కాదు. వడదెబ్బకు ఉత్తమ ఔషధంగా మట్టి పాత్రల్లోని చల్లని నీరు, చిటికెడు చక్కర, ఉప్పు కలిపిన నీళ్లు, నిమ్మకాయ రసం, కొబ్బరినీళ్లు, ఇంట్లో చేసిన షర్బత్‌ద్రవాలు, మజ్జిగ, తాజాపండ్ల రసాలు తీసుకోవడం ఉత్తమం. ఆల్కహాల్ సేవనంతో డీహైడ్రేషన్ పెరుగుతుందని గమనించి పూర్తిగా తగ్గించాలి.

### ఇండోర్‌లో పరిమిత వ్యాయామం

ఉదయం 7గంటల లోపు సమీప గార్డెన్స్‌లో వాకింగ్ వంటి వ్యాయామాలు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎండలో కాకుండా ఇండోర్స్‌లో శారీరక వ్యాయామం, వీలైతే స్విమ్మింగ్ చేయాలి. అతిగా వ్యాయామం చేసినపుడు డీహైడ్రేషన్ సమస్యలను కొని తెచ్చుకోరాదు. వ్యాయామం చేస్తున్నపుడు మధ్యమధ్య విశ్రాంతి లేదా బ్రేక్స్ తీసుకోవడం ఉత్తమం. వేసవిలో సరికొత్త వ్యాయామాలు చేయడం సముచితం కాదు. తొలిసారి యోగా, జిమ్‌లాంటి వ్యాయామాలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాళ్లకు బూట్లు, చెప్పులు లేకుండా వ్యాయామం చేయడం అలవర్చుకోవాలి.



### ఇంటిని చల్లగా ఉండేలా జాగ్రత్తలు

ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడి గదులు కూల్‌గా ఉండేవిధంగా శ్రద్ధ తీసుకోవాలి. కిటికీలకు కర్టెన్స్ అమర్చుకోవడంతో ఎండ నేరుగా ఇంట్లోకి ప్రవేశించదని తెలుసుకోవాలి. మధ్యాహ్న వేళల్లో వడగాలులు ప్రవేశించకుండా కిటికీలు మూసివేయడం, సాయంత్రం తిరిగి తెరవడం మంచిది.

### నిద్రకు ప్రాధాన్యం

అతివేడి, అతిచల్లదనం నిద్రను భంగపరుస్తుంది. నిద్రకు ముందు స్నానం చేయడంతో శరీర వేడి తగ్గి నిద్రకు ఉపకరిస్తుంది. ప్రతిరోజు 6-8 గంటలు నిద్రపోవాలి. నిద్రకు 2 గంటల ముందు వ్యాయామం చేయడం మంచిది కాదు. సాయంత్రం అతిగా తినడం, ఆల్కహాల్ తాగడం, పొగతాగడం మానేయాలి. పడక గదికి టీవీ, సెల్‌ఫోన్, ట్యాబ్స్‌తో తీసుకురావద్దు.

### సన్‌స్క్రీన్స్ వాడకం

వేసవితాపానికి చర్మం, తల వెంట్రుకలకు హాని కలుగుతుంది. ఎండవల్ల సన్‌బర్న్స్, హీట్, రాషెస్, వెంట్రుకలు రాలిపోవడం లాంటి అనారోగ్యాలు పెరుగుతాయి. ఎండలోకి వెళ్లే ముందు చర్మానికి/ వెంట్రుకలకు మాశ్చరైజర్స్, లోషన్స్, జెల్స్ వాడడం మంచిది. మన చర్మ స్వభావాన్ని బట్టి ముఖం, మెడ, ఎండ పడే శరీరప్రాంతాలకు తగిన తగిన సన్‌స్క్రీన్ లోషన్‌ంప 3గంటల ఎ బ్బఆకి వాడడం మరువరాదు. పెదవులు పగలకుండా తగిన లిప్‌స్టిక్, ఫేషియల్ వాడాలి. ముఖంపై చల్లని నీరు చల్లుకోవాలి. శరీరాన్ని తుడుచుకోవడానికి తడి కాటన్‌ను వాడాలి.

### కాటన్ దుస్తులు

వేసవి తాపాన్ని తట్టుకొనే తేలికైన, వదులు, పలుచని, తెల్లరంగు కాటన్ లేదా లెనిన్ వస్త్రాలు, లూజ్‌పైజామా ధరించాలి. లెదర్, మందపు సిల్క్ వస్త్రాలు, జీన్స్ వాడరాదు. మెడకు స్కార్ఫ్, చేతులకు గ్లౌజులు, టోపీలు, జాకెట్స్ వాడడం మంచిది. ఉతికి ఆరేసిన బట్టలు పూర్తిగా ఆదేవిధంగా చూసుకోవాలి.

వేసవి తాపం, వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి తగు జాగ్రత్తలు తీసుకుంటూనే ఆహారం, తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కలుషిత నీటివల్ల సంక్రమించే వ్యాధుల నుంచి కాపాడుకోవాలి. ప్రత్యేకంగా పిల్లలు, వృద్ధులు ఈ సీజన్‌లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండవేళలో బయటకు రాకుండా ఉంటే మంచిది. అప్పుడప్పుడు వైద్యులను సంప్రదిస్తుండాలి.

## ఊరంతా ఊడ్చేస్తాడు



పల్లెల్లో ఉదయాన్నే లేవగానే ఎవరి వాకిళ్ల వాళ్లు శుభ్రం చేసుకుంటుంటారు. కేరళలోని ప్రేమ్‌దోమ్ పంచాయితీకి చెందిన సుధీశ్‌కుమార్ మాత్రం లేవగానే ఇంటి పరిసరాలతోపాటు గ్రామంలోని రోడ్లన్నీ ఊడ్చాకే దినచర్య మొదలుపెడతాడు. ఎన్నికల సమయం కాబట్టి ఊరంతా ఊర్చేసి మార్కులు కొట్టేసే రాజకీయ నాయకుడేమో అనుకుంటారేమో కానీ అతనో సామాన్య రైతు. దాదాపు పదేళ్లుగా ఏమీ ఆశించకుండా బాధ్యతగా గ్రామాలన్నీ, పరిసరాల్నీ పరిశుభ్రంగా ఉంచడంతోపాటు.. మూగజీవుల్నీ ఆదరిస్తుంటాడు. అటవీశాఖాధికారిగా పనిచేసిన తండ్రి స్ఫూర్తితో మూగజీవులకు సేవ చేయడంతో పాటు పుట్టి పెరిగిన ఊరికోసం తనవంతుగా ఏదైనా చేయాలని పరిసరాలను శుభ్రం చేస్తున్న సుధీశ్ అంటే గ్రామస్తులకు ఎంతో అభిమానం. ఆయన మాటంటే గౌరవం. అందుకే ఎన్నికల వేళ గ్రామమంతా ప్రచారం చేయడానికి బదులు రాజకీయ నాయకులు ఓట్ల కోసం సుధీశ్ ఒక్కరింటికే వెళ్లి ఆయన మద్దతు కోరుతుంటారట.

## గుడ్డు తినొచ్చు



శాకాహారులైనా మాంసాహారులైనా సరే గుడ్డు తినడంపైనా ఎన్నో భయాలు అలముకుంటున్నాయిప్పుడు. ముఖ్యంగా గుడ్డులో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుందనీ, అది హృద్రోగానికి దారితీస్తుందనీ చాలామంది నమ్ముతారు. ఇందులోని నిజాలేమిటో తెల్సుకోవాలని తాజాగా ఓ చిన్నపాటి పరిశోధన నిర్వహించారు. అమెరికాలో అక్కడి డ్యూక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఇందుకోసం అరవైయేళ్లు దాటిన 140 మందిని ఎంచుకున్నారు. వీళ్లలో సగం మందిని విటమిన్లు ఎక్కువగా ఉన్న 'ఫోర్టిఫైడ్ గుడ్లను తినమన్నారు. వారాని కి 12 గుడ్లు ఏరూపంలోనైనా తీసుకోవచ్చని చెప్పారు. మిగతావాళ్లని ఐదుకన్నా తక్కువ గుడ్లు తినమన్నారు. నాలుగు నెలల తర్వాత వాళ్లని పరీక్షిస్తే గుడ్లు ఎక్కువగా తిన్నవాళ్లలో కొలెస్ట్రాల్ పెరగకపోగా -0.64 నుంచి -3.14 వరకూ తగ్గిందట. పైగా, గుడ్డులోని విటమిన్ల అండదం వలమధుమేహానికి కారణమైన 'ఇన్సులిన్ రెసిస్టెన్స్' కూడా స్వల్పంగా తగ్గిపోయిందని చెబుతున్నారు. కాబట్టి రోజుకో గుడ్డు తినడం మేలేనంటున్నారు.



ఉన్న చోటే ప్రశాంతంగా ఉండిపోతుంది
తల్లి మనసెప్పుడూ ఆమె వద్ద ఉండదు.
అది ఎల్లప్పుడూ తన
ప్రాణబంధాలను చుట్టుకొనే ఉంటుంది
వాళ్ల మంచి చెడ్డలు కళ్లతో
కాకపోయినా తన మనసుతోనైనా

# ప్రేమను కన్న అమ్మ

చూడాలనుకొంటుంది.
ఆమెకు ప్రపంచంలో ఏదీ అద్భుతం కాదు!
పిల్లల ఆటపాటలు, ముద్దు ముద్దు మాటలు
ఎదుగుదలలోనే
ఆమె అన్ని అద్భుతాలు చూసేస్తుంది
వృద్ధాశ్రమంలో పడేసినా తల్లి
బిడ్డల్ని నిందించదు.
తను అక్కడే ఉంటే వాళ్లకు
శ్రమ లేకుండా ఉంటుందని తెలిస్తే
ఆమె ఎంతో సంతోషంగా
శేష జీవితాన్ని అక్కడే ముగిస్తుంది!

పచ్చటి మొక్క నల్లని మట్టిని
చీల్చుకొని బయటికొచ్చి ప్రపంచాన్ని
చూసి ఆనందంతో కొమ్మలు
రెమ్మలుగా వికసిస్తూ వర్ధిల్లుతుంది.
తల్లి లాంటి మట్టి మనసు
ఎదుగుతోన్న బిడ్డనలాగే
నిర్మలంగా చూస్తూ తను మాత్రం

– భీమవరపు పురుషోత్తమ్

# ఈవారం కవిత్వం

# చెట్ల పై భాగం నుండి..

ఇప్పుడు కాంతి
తనను తాను పరిమితం చేసుకొని
చెట్ల పైభాగం నుండి ఎగిరిపోయింది.
పోతూ పోతూ
యుగాలుగా మోస్తున్న భద్రతను
నీడలు నీడలుగా ఎత్తుకెళ్ళిపోయింది.
వెతకాలి
కాంతిని, నీడలను,
నీడల వెనుక ఉన్న చరిత్రను,
చరిత్రను మానభంగం చేసిన మనుషులను,
వెతికి పట్టుకోవాలి.
చీకటిని దోసిళ్ళలో నింపుకొని
పారిపోయిన, పాడుబడిన
కాంతిని శుద్ధి చేయాలి.
మీరు కోరుకోరు, నేను కూడా
మళ్ళీ రిస్క్ చేయడానికి
ఇష్టపడను.
కాబట్టి
జీవితం కోసం రుచికరమైన కాంతి;
అధిక ఆనందం.
గిన్నెలో నీళ్ళు ఒలికిపోవడం,
నాలుగు గోడలు
రాత్రికి ధరించడం,
ఇంటి ముందు మొన్న నాటిన
మొక్కలకు పువ్వులు వాడిపోవడం,
నది కడుపులో
చేపపిల్లల అరుపులు ఆగిపోవడం;
గతించిన కాంతికి సాక్ష్యాలు.
ఇప్పుడు
గర్భం కాంతిని పులుముకోవాలి
కాంతిని ప్రసవించాలి.
అదిగో... చూశారా
తల్లి... కాంతిని విశ్వానికి అందించే దృశ్యం.

– జాని తక్కెడశిల



## పుస్తక సమీక్ష



## అరచేతిలో స్వర్గం

ప్రముఖ కథారచయిత సి.హెచ్.శివరామప్రసాద్ (వాణిశ్రీ) రచయిత ఈ నవల అంకితం చేసారు. 'నిత్య' మాసపత్రికలో సీరియల్‌గా ఈ నవల ప్రచురణ అయింది. పాఠకుల ఆదరణ పొందింది. 'స్వర్గనరకాలు' అంశంపై మానసిక విశ్లేషణగా ఈ నవలను కుటుంబచ్ఛాయ పునాదితో రాసారు రచయిత. 1973 నుండి రచనలు చేస్తూ దాదాపు 509 కథలు, 72 నవలలూ 2 నాటకాలకు, 4 నాటికలు రాసారు. ఇతర భాషల్లోకి వీరి కథలు అనువదింపబడ్డాయి. ఇక ఈ నవల గురించి చూద్దాం! సావిత్రి పాత్రను అద్భుతంగా చివరి అంకం దాకా బాగా రాసారు. సైకిల్‌పై బట్టలు అమ్మే చక్రధరయ్య సిటీలో పెద్ద శారీ షోరూమ్ యజమానిగా ఎదుగుతాడు. స్వర్గంలో సర్వసౌఖ్యాలు అనుభవిం చాలనే కోరికతో పూజలు, దానధర్మాలు చేస్తుంటాడు. భార్య సావిత్రి అన్నివిధాల తనకు సహకరిస్తుంది. వారి ఇద్దరు పిల్లలు కుమార్, రాగిణిలు ప్రేమలో పడతారు. రాగిణి కంప్యూటర్ సెంటర్ ఓనర్ వెంకిని ప్రేమించి పెళ్లికి సిద్ధమౌతుంది. కొడుకు కుమార్ నాటకరంగంలో వేషాలు వేసే జయమాల కూతురు సరితతో ప్రేమాయణం సాగిస్తుంటాడు. పెళ్లీడుకు వచ్చిన కూతురు, కొడుకుల పెళ్లి చేయాల్సిన వయసులో తన సుఖం, స్వర్గం కోసం పరుగులు పెట్టె తండ్రి చక్రధరయ్య (వస్త్రవ్యాపారి) పాత్ర చివరి పేజీదాకా ఆసక్తిగా రాసారు. **(అరచేతిలో స్వర్గం, రచన: సింహప్రసాద్, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)** **– తంగిరాల చక్రవర్తి**



## తెలుగు సాహిత్య లోకాలోకనం

పుస్తకం హస్త భూషణమేకాదు, మస్తక భూషణం కూడా! కంప్యూటర్లు వచ్చిన కొత్తలో పుస్తకాలకు కాలం చెల్లిందని తలలు పట్టుకున్నారు. కాలక్రమేణా ఇది తప్పని రుజువు అయింది. అంతేకాదు, ఓ పది పుస్తకాలు ముందు వేసుకుని, ఏది చదవాలో ఎంపిక చేసుకునే లోపు మరో వంద అచ్చయి మన ముందుకు వస్తున్నాయట! మంచి పుస్తకాలు చదవాలనే తాపత్రయం ఉండి, ఏది మెరుగో, ఏది ఒరుగో తెలియని వారికి చీకోలు సుందరయ్య ఈ 'చదివి చూద్దాం' గొప్ప ప్రయోజనకారి అవుతుంది. కవిత్వం కథ, నవల, వ్యాసాలు, జీవితచరిత్ర, నాటికలు, కార్టూనులు మొదలైన సాహితీ ప్రక్రియల న్నింటినీ రచయిత గాలించి వడపోసి చివరకు 123 వ్యాసాలను 'చదివి చూద్దాం'లో చేర్చారు. మూడు దశాబ్దాల పత్రికారంగ అనుభవం సాహిత్య రచనల పోటీల నిర్వహణానుభవం, టి.వి.రంగంలో చర్చానుభవం వీరికి బాగా కలిసి వచ్చింది. వందల పుస్తకాల పఠనానుభవంతో రాసిన వ్యాసాలు కనుక ఆణిముత్యములులనుటలో ఏమాత్రమూ సందేహం లేదు. లోగడ ఇవన్నీ పలు పత్రికలలో ప్రచురించబడి ప్రశంసలందుకున్నవి కనుక ఈ వ్యాసాలన్నీ ఆణిముత్యాలే! మరీ లోతుల్లోకి పోయి విశ్లేషించకుండా ముఖ్యవిషయాలు విస్మరించకుండా రాయబడిన ఈ వ్యాసాలు తెలుగు సాహిత్యపు 'నాడీ'గా చెప్పవచ్చును.

**(చదివి చూద్దాం, సమీక్షావ్యాసాలు, రచన: చీకోలు సుందరయ్య, వెల: రూ 240, ప్రతులకు: అన్ని పుస్తకకేంద్రాలు)** **– కూర చిదంబరం**

## సుబ్బాయమ్మ అందిస్తున్న దేశభక్తి కవిత్వం



ఏడుపదుల వయస్సులో విశ్రాంత ఉపాధ్యాయిని ఐ.వి.సుబ్బాయమ్మ వెలువరిస్తున్న ఆరవ పొత్తం 'పుణ్య భూమి', 38 వచన కవితల్లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన, అనేక త్యాగాలను చేసిన నాయకులను, కవులను, కళాకారులను, మేధావులను, సైనికులను కీర్తిస్తు అక్షరార్చన గావించారు కవయిత్రి. స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌ను స్త్రీజాతి శిరోమణిగా, సంస్థాలన్నింటినీ ఏకీకరణం చేసిన సర్దార్‌వల్లభాయ్ పటేల్‌ను ఉక్కు మనిషిగా, భగత్‌సింగ్‌ను విప్లవజ్యోతిగా శ్లాఘిస్తు కవితలను అల్లారు సుబ్బాయమ్మ. మన మువ్వన్నెల పతాకాన్ని 'భారతజాతికి స్వేచ్ఛా వాయువులందించిన జెండా'గా అభివర్ణిస్తారు. మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, చంద్రశేఖర్ అజాద్‌లను నిజమైన దేశభక్తులుగా స్మరిస్తారు. తెలంగాణ మంచిర్యాల జిల్లా చెన్నూరు, సుబ్బాయమ్మ స్వస్థలం. తెలంగాణ సాయుధ పోరాట వీరుడు రావినారాయణరెడ్డి, మహాకవులు దాశరధి, వానమలై వరదాచార్యుల ప్రతిభను ప్రశంసిస్తు రాసిన కవితలు స్ఫూర్తిదాయకం. 'ధర్మభూమి, తపోభూమి, కర్మభూమి/ పుణ్యభూమి మనదేశం/ వేదశాఖలు వెలసిన దేశం/ యజ్ఞయాగాదులకు పుట్టినిల్లు మనదేశం' అంటు జన్మభూమిని శ్లాఘిస్తు రాసిన పొత్తాన్ని భరతమాత సేవలో అనునిత్యం తరిస్తున్న వీరజవానులకు అంకితం గావించారు సుబ్బాయమ్మ. **(పుణ్యభూమి, రచన: ఐ.వి.సుబ్బాయమ్మ, వెల: రూ 100, ప్రతులకు: నవచైతన్య, నవోదయ బుక్‌హౌస్‌లు)** **– రమణ వెలమకన్ని**

## పేదల న్యాయమూర్తి క్రిష్ణప్ప



లీగల్ సర్వీసెస్ రైట్స్ ప్రొటెక్షన్, ఆధ్వర్యంలో తిప్పినేని రామదానప్పనాయుడు రచన–సేకరణ 'పేదల న్యాయమూర్తి క్రిష్ణప్ప' ఆసక్తికరంగా చదివింపచేస్తోంది. అరుదైన న్యాయమూర్తిగా క్రిష్ణప్ప సాధించిన విజయాలు, సేవాదృక్పథం జీవిత చరిత్ర రూపేణా వివరించడంలో రచయిత ప్రశంసనీయమైన కృషి పుస్తకం, ప్రతిబింబింపచేస్తోంది. పూరిగుడిసె నుండి జిల్లా జడ్జిగా ఎదిగిన విశిష్ట వ్యక్తిత్వం యువతకు ఆదర్శంగా, జీవిత కథనం ఆకట్టుకుంటోంది. 32 ప్రత్యేక అంశాల సంక్షిప్త వ్యాసాలుగా, కథానాయకుడైన క్రిష్ణప్పలో వున్న ఆదర్శ, అభ్యుదయ భావాలు, న్యాయవాదిగా జూనియర్ సివిల్ జడ్జిగా, జడ్జిగా, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శిగా, జిల్లా జడ్జిగా పేదలకు అందించిన సేవలు రచయిత రామదాసప్పనాయుడు గ్రంథస్థం చేసారు. సామాన్యులకు అవసరమయ్యే అనేక ప్రాథమిక న్యాయసూత్రాలు, కొన్ని సెక్షన్‌లను కూడా పొందుపరిచారు. న్యాయమూర్తిగా తీర్పులు ఉన్నాయి. యువన్యాయవాదులకు, చట్టాల పరిజ్ఞానం అంతగా లేని వారికి చైతన్యవంతంగా చుక్కానిలా ఉపకరించే ఉత్తమ జీవన చైతన్యవంతంగా చుక్కానిలో ఉపకరించే ఉత్తమ జీవన కథనం, అందించిన రామదానప్ప అభినందనీయులు. **(పేదల న్యాయమూర్తి క్రిష్ణప్ప, రచన, సేకరణ: తిప్పినేని రామదానప్ప నాయుడు, వెల: రూ 600, ప్రతులకు: కొల్లె దేవేంద్ర, వన్నెదొడ్డి, గుత్తి మండలం, అనంతపురం జిల్లా)** **– యఱ్ఱమిల్లి**

# అవధుల్లేని అమ్మ ప్రేమ



**'దేవుడు అన్నిచోట్ల ఉండలేడు. కాబట్టే అమ్మను సృష్టించాడు' తల్లిని మించిన శ్రామికులు ఎవరున్నారు? మిగిలిన శ్రామికులంతా వేతన జీవులేకదా! ఇలా చెప్పుకుంటూ పోతే తల్లిగా స్త్రీ గొప్పతనాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే. సమాజంలో స్త్రీ వివిధ సందర్భాల్లో ఆమె నిర్వర్తించే బాధ్యతలే ఆమెను ఉన్నత శిఖరాన నిలబెట్టాయి.**

డా॥ ఓరుగంటి సరస్వతి

కన్నీటిని దాచుకుంటూ చిరునవ్వులు చిందిస్తుంది. పిల్లలను ఆమె (తల్లి) సరిగ్గా తీర్చిదిద్దకపోతే సమాజం దారితప్పిపోతుంది. అంత గొప్ప బాధ్యతల్ని కూడా తన భుజస్కంధాలపై అవలీలగా మోయగలుగుతున్న ఆ అద్భుత శక్తి ఎవరో కాదు అమ్మ. ఆ అమ్మే మనల్ని అవనిపై తీసుకువచ్చిన దేవత.. దాశరథిగారు అన్నట్లు.. 'అమ్మ అన్నది ఒక కమ్మని మాట. అది ఎన్నెన్నో తెలియని మమతల మూట.

దేవుడు లేడనే మనిషున్నాడు. అమ్మేలేదనువాడు అసలేలేడు అమ్మంటే అంతులేని సొమ్మురా. అది ఎన్నటికీ తరగని భాగ్యమ్మురా'. అమ్మ ఒడే మొదట బడి. పిల్లలు తల్లి నుండే కమ్మని మాటలు నేర్చుకుంటారు. అమ్మ నేర్పే మాటల్లో మంచి నడత, నడవడిక మాత్రమే ఉంటుంది. కాబట్టి అమ్మ అంటేనే కమ్మని మాట.అమృతం వంటి మనసు అమ్మకు మాత్రమే ఉంటుంది. అమ్మ ఉంటే అన్ని ఉన్నట్లే. అంటే ఈ ప్రపంచం లోనే తల్లి ఎంత గొప్పదో మాటల్లో చెప్పలేం. అందుకే 'తల్లిని మించిన దైవం లేదు' అంటుంటారు. ఆడపిల్లగా ఉన్నప్పటి నుండే తన భవిష్యత్తుని గురించి కలలు కంటూ తన బాధ్యతల్ని ఎరిగి మసలుకుంటుంది. తన అమ్మ, అమ్మమ్మ, నానమ్మ, మేనత్త తల్లులుగా ఎలా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారో గమనిస్తూ పెరుగుతుంది. ఎందుకంటే తను కూడా అలాంటి బాధ్యతల్ని నిర్వర్తించాలి కదా!

ఏ యుగంలోనైనా, ఏకాలంలోనైనా ఏ ప్రాంతంలోనైనా, ఏ దేశంలోనైనా, ప్రపంచంలో ఎక్కడైనా మాతృమూర్తులుగా తల్లుల అవిశ్రాంత బాధ్యతలు వర్ణింపలేనివి. స్త్రీ తన గర్భంలో బిడ్డను మోస్తున్నప్పుడు శారీరకంగా, మానసికంగా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ కొత్త ప్రాణాన్ని భూమిపైకి తీసుకువచ్చే క్రమంలో అమ్మ పోరాటం అంతా ఇంతా కాదు. తన ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా మనల్ని భూమిపైకి తీసుకువచ్చిన త్యాగమూర్తి అమ్మ. తన రక్తాన్ని పాలుగా మార్చి, మనల్ని బ్రతికిస్తుంది.

'ఆస్తాం తావదియం ప్రసూతి సమమే దుర్వార శూల వ్యథా నైరుచ్యం తనుశోషణం మలమపి శయ్యాచ సాంవత్సరీ ఏకస్యాపినే గర్భభార భరణ క్లేశస్య యస్స్యాక్షమో ధాతుం నిష్కృతి మున్నతోపి తనయ: తస్యై జనన్యై నమ: (ఆదిశంకరాచార్య మాతృపంచక శ్లోకాలు)

'అమ్మ! నన్ను కన్న సమయంలో నువ్వు ఎంతటి శూల వ్యధను అనుభవించావో కదా! కళను కోల్పోయి, శరీరం శుష్కించి, శయ్యమలినమైనా సంవత్సరకాలం ఆ క్లేశాన్ని ఎలా భరించావో కదా! ఎవరైనా అలాంటి బాధను సహించగలరా! ఎంత ఉన్నతుడైనా కుమారుడు తల్లి ఋణాన్ని తీర్చుకోగలడా? అంటూ కన్నతల్లి త్యాగగుణం కొనియాడారు. తల్లి త్యాగగుణాన్ని తెలిపిన పై శ్లోకం. అందరి హృదయాల్ని ద్రవింపచేసే కాదనలేని సత్యం.

ఆడపిల్ల అక్కగా, చెల్లిగా, భార్యగా, తల్లిగా, ఉద్యోగినిగా.. ఇలా ప్రస్థానం సాగుతుంది. ఒకప్పుడు స్త్రీలు ఇంటికే పరిమితమై ఇంటి బాధ్యతల్లో మాత్రమే తలమునకలయ్యేవారు. కానీ నేడు అన్ని రంగాల్లో తనదైన ముద్రను అదనంగా పోషిస్తున్న నేటి తల్లులకు పిల్లల బాధ్యత సవాలుగానే ఉందని చెప్పవచ్చు. ఎందుకంటే ఒకప్పుడు భార్యగా, తల్లిగా, కోడలిగా, కుటుంబ బాధ్యతల్ని నెరవేర్చు కొనేది తనకున్న పరిధిలో. కానీ నేటి ఆధునిక మహిళ (తల్లి)కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూ.. ఉద్యోగం కూడా చేసు కుంటూ ముందుకు సాగుతుంది. ఈ క్రమంలో తల్లిగా తన పిల్లలకు ఏ లోటు రాకుండా అహర్నిశలు శ్రమిస్తుంది. అసలు తింటుందా? లేదా? కంటి నిండా నిద్రపోతుందా? లేదా? అంటే సమాధానం లేని ప్రశ్నే? అది ఆ తల్లి మనసుకే విదితం! ఆఫీసులో బాసుతో, ఇంట్లో బాసుతో అప్పుడప్పుడు చివాట్లు, అన్నీ పిల్లలకోసమే, కుటుంబం కోసమే కదా' అనందంగా భరించగలదు. అందుకే అమ్మ అయింది. చంటి పిల్లలు ఉన్న ఉద్యోగినుల బాధ వర్ణనాతీతం. అన్నిచోట్ల బేబీకేర్ సెంటర్‌లు ఉండకపోవచ్చు. నేడు ఉన్నట్లు వంటి పరిస్థితుల్లో ఆడా, మగా (భార్యాభర్తలు) ఉద్యోగాలు చేయాల్సిందే!

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అందరి మధ్య పిల్లలు పెరిగి పెద్దయ్యేవారు.ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. దాంతో ఉద్యోగినిగా మారిన తల్లికి పిల్లల పెంపకం సవాలుగానే మారిందని చెప్పవచ్చు.తల్లి పొత్తిళ్లలో పెరగాల్సిన బాల్యం బేబీ కేర్‌సెంటర్ స్మర్ళలో పెరుగుతుంది. ఇటు తల్లికీ, బిడ్డకూ ఇద్దరికీ మానసిక సంఘర్షణయే పెరుగుతుంది. ఇటువంటి సందర్భాల్లో కుటుంబాల్లో భర్త ప్రోత్సాహం (తండ్రిగా)ఉంటే, ఆ తల్లి ముందుకు వెళ్లగలదు. లేదంటే తల్లిమనసు తల్లడిల్లి ఉద్యోగాలు కూడా మానేస్తున్నారు. ఎందుకుంటే తన (తల్లి) భవిష్యత్తు కంటే కూడా తన పిల్లలు భవిష్యత్తుకే ప్రాధాన్యతనిస్తుంది. తన జీవితాన్ని సైతం ఫణంగా పెడ్తుంది. పేగుబంధం, కన్నపాశం అలాంటిది మరి! కానీ అటువంటి త్యాగమయి(తల్లి) నిరాదరణకు గురవడం శోచనీయం. కుటుంబం కోసం అహర్నిశలు శ్రమించి, రేయనకా, పగలనకా, ఎంతో కష్టపడిన తల్లులు నేడు వృద్ధాశ్రమాల్లో, అనాథశరణాలయాల్లో ఉంటున్నారు. వికలాంగులైన పిల్లలు పుట్టినా తల్లి వారిని వదిలివేయదు. కంటికి రెప్పలా అన్నీ తానై పెంచుకుంటుంది. అదీ అమ్మంటే. తన ప్రాణమున్నంత వరకు చూస్తుంది. తన తర్వాత ఎలా బతుకుతారా అని వికలాంగులైన పిల్లల గురించి విలవిల్లాడుతుంది. అంతటి దైవస్వరూపం అయిన తల్లిదండ్రుల్ని ఉన్నత చదువులు, ఉద్యోగాలు, పెళ్లిళ్ల పేరుతో విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడి తమ (కన్నవారి)ఆశల సౌధాల్ని కూల్చివేస్తున్నారు. బ్రతికుండగానే చచ్చిన శవాల్లా బతుకులీడుస్తున్న వారి అరణ్యరోదనలు ఎవరికీ వినిపించవు. మా పిల్లలు విదేశాల్లో ఉన్నారని సంతోషం ఒకవైపు, అవసాన దశలో మా పక్కన లేరు అన్న ఆవేదన మరోవైపు, ఆ తల్లిదండ్రుల ఆవేదనను కన్నబిడ్డలు కాక మరెవరు అర్థం చేసుకోవాలి?



కంటికి రెప్పలా కాచుకున్న తల్లిదండ్రుల్ని అవసాన దశలో వదిలివేయకూడదు. వారి ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలే నిది. బిడ్డలు ఎలాంటి తప్పులు చేసినా 'క్షమయా ధరిత్రి' అన్నట్లుగా అమ్మ ఉంటుంది. కోపగించుకోదు. బిడ్డల సంతోషమే తన సంతోషంగా బతుకుతుంది. అటువంటి అమ్మను దేవతలా చూసుకోవాల్సిన బాధ్యత మనసు ప్రతీ బిడ్డకి ఉండాలి. తల్లిదండ్రుల గొప్పతనాన్ని గుర్తుచేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. సినిమా సైతం మంచి సందేశాలిస్తున్నాయి. సాహిత్యరూపంలో మనకెంతో సందేశాలిస్తున్నాయి. ఎందుకంటే మరుగున పడిపోతున్న విలువల్ని, బంధాల్ని గుర్తు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది.

"అచ్చ తెలుగు భాషరా అమ్మంటే.. అమ్మంటే స్వచ్ఛమైన శ్వాసగా..' /అమ్మంటే మరో ప్రణవ నాదమురా..
ఆకాశాన సృష్టికర్త బ్రహ్మరా అవనిమీద సృష్టికర్త అమ్మర్రా అంటూ అమ్మ గొప్పతనాన్ని చూపించిన మహనీయులు ఎందరో!

ఓంకారం నుంచే సృష్టి జన్మంచిందనేది ఐతిహ్యం. అలా సృష్టికి జన్మనిచ్చిన
మరోరూపమైన అమ్మను బ్రహ్మతో పోల్చడం చాలా గొప్ప విషయం.

ఆత్రేయగారు అమ్మను గురించి ఇలా చెప్పారు...
"అమ్మవంటిది అంతమంచిది అమ్మ ఒక్కటే
అమ్మయినా, జేజైన అమ్మ పిమ్మటే..
అమ్మంటే త్యాగము అమ్మే ఒక యోగము.
అమ్మంటే సత్యము అమ్మే సర్వస్వము- అంటే అమ్మ ఉంటే అన్ని ఉన్నట్లేనని, అమ్మ లేకపోతే అన్ని ఉన్నా కూడా ఏమీ లేనట్లే అన్న సత్యం అర్థమవుతుంది.

సినారే గారు అమ్మను గురించి ఇలా అన్నారు..
'మా అమ్మను మించి దైవమున్నదా? ఆత్మను మించి అర్థమున్నదా..
జగమే పలికే శాశ్వత సత్యమిదే అందరినీ కనే శక్తి అమ్మ ఒక్కతే
అవతార పురుషుడైనా ఓ అమ్మ కొడుకే..
అమ్మ గొప్పతనం ఇంతకు మించి ఏం చెప్పగలం.

సిరివెన్నెల గారు తల్లి గొప్పతనాన్ని ఇలా చెప్పారు..
పొత్తిళ్లలో చిట్టిపుత్తడి బొమ్మను
పొదుపుకున్న ముద్దుగుమ్మ అమ్మ
అమ్మ పొందేటి ఆనందం ఏదో
తెలియాలంటే
ఎత్తాలి తన ఆడజన్మ బ్రహ్మ..'
ఇంటి త్యాగమయి, తల్లిని ఎన్నిజన్మలెత్తినా ఆమె ఋణం తీర్చుకోలేనిది.
పొత్తిళ్లలో పుత్తడి బొమ్మను పొదుపుకున్న ముద్దు గుమ్మ అమ్మ..
అమ్మ పొందేటి ఆనందం ఏదో తెలియాలంటే..
ఎన్ని జన్మలెత్తినా తల్లి ఋణం తీర్చుకోలేనిది.

తల్లి ఎన్నిబాధ్యలైనా తన కన్నపిల్లల కోసం భరిస్తుంది. సహిస్తుంది. వారు ఏమాత్రం బాధపడ్డా ఆ తల్లిమనసు కకావికలమవుతుంది. అటువంటి తల్లిని అవసాన దశలో చూడ సంతానాన్ని ఏమనాలి? తమని ఒక పనికిరాని వస్తువుల్లో మూలకు పడేస్తే భరించగలరా? అప్పుడే వారిగుండె ముక్కలవుతుంది. బ్రతికున్న శవాల్లా చెయ్యొద్దు.
ఉగ్గుపాలతో ఓర్పును, సహనంతో శౌర్యంను నేర్పిన అమ్మను ప్రతి ఒక్కరు గౌరవించాలి.
ఒంటరిగా (అనాథగా) వదిలివేయగూడదు. మనకి జన్మనిచ్చిన, నడక నేర్పి నడతనేర్పి వారికి (తల్లిదండ్రులు) సంతోషాన్ని అందించే వారికి అవసాన దశలో మనంతల్లిలా మారడమే వారికిచ్చే గౌరవం.
అంతేకాని ఓ ఒక్కరోజూ మదర్స్‌డే చేసుకొని, ఫోటోల కోసం అన్నట్లుగా ఉండకూడదు.
"కని పెంచిన అమ్మకే అమ్మవుదాం"
ఇది ఈ మాతృదినోత్సవం సందర్భంగా చిన్న సందేశం .
అమ్మలందరికీ 'మాతృదినోత్సవం' శుభాకాంక్షలు. ❑

కథ

# ఏపాటి వాడు

**సింహగిరి** అడవికి రాజు సింహం. అది తన రాజ్యాన్ని చక్కగా పాలించేది. ఆ సింహానికి ముసలితనం రావడం వలన రాజ్యపాలన కష్టమైంది. అందుకు అడవిలో ఉన్న జంతువులన్ని ఒకరోజు సమావేశపరిచింది. 'నేనింకా రాజ్యపాలన చేయలేను. అందుకుగాను దుర్బుద్ధి అనే తోడేలు చాలా చాకచక్యం కలది, ధైర్యం కలది అందుకు దాన్ని, సుబుద్ధి అనే కుందేలు చాలా తెలివికలది, ఇతరుల మేలుకోరేది. అందుకుగాను కుందేలుని, వీళ్లిద్దరికీ నేను పోటీ పెడుతున్నాను మీరందరూ ఎవరికి ఎక్కువ మద్దతు ఇచ్చి గెలిపిస్తే వారినే రాజు చేస్తా' అని చెప్పింది.



సింహం మాటలకు అన్ని జంతువులు చిత్తం రాజా! అన్నాయి. కుందేలు పార్టీ గుర్తు కోడిపుంజు. తోడేలు పార్టీ గుర్తు క్యారెట్. ఈ రెండు జంతువులు అడవి అంతా తిరుగుతూ ఓట్లు అడుగుతున్నాయి. ఇలా రెండురోజులు అయ్యాక తోడేలుకి కుందేలుగాని, దాని పార్టీ గుర్తుగాని గుర్తు వస్తే చాలా కోపం వచ్చేది. అందుకుగాను అడవిలో ఒక్క కోడిపుంజు కూడా లేకుండా అన్ని చంపి తినేసింది. 'అబ్బో! తోడేలిది ఏమి కుటిల బుద్ధి అనుకున్నాయి మిగతా జంతువులు. అప్పుడు అన్ని జంతువులు కుందేలు దగ్గరికి వచ్చి తోడేలు



దుర్బుద్ధితో అడవిలోనున్న కోడిపుంజులన్నింటినీ తినేసింది నువ్వేంటి ఏమీ పట్టనట్టు ఉన్నావు?' అని చెప్పాయి. కుందేలు వారందరి మాటలకి ఒక నవ్వు నవ్వేసింది. ఓ స్నేహితులారా! తోడేలు చేసే పని నాకు తెలుసు కానీ దాని పాపానా అదేపోతుంది. దానిపైన దానికే నమ్మకం లేక ఇలా చేస్తుంది' అని చెప్పింది. 'ఏమిటో! ఈ కుందేలుకి రాజు అవ్వాలని లేదా?' అనుకుని జంతువులన్నీ వెళ్లిపోయాయి. అడవిలో వృద్ధులైన ఏనుగు, ఎలుగుబంటి, పులి, సింహం అంతా కలిసి కుందేలు సుబుద్ధి చాలా తెలివైనది తను తెలివితో అడవిని నిస్వార్థబుద్ధితో పరిపాలించ గలదు. కానీ అడవిలో జంతువులన్నీ ఎవరిని గెలిపిస్తాయో అర్థం కావడం లేదు అని మాట్లాడుకుంటున్నాయి. ఇంతలో పోటీ జరిగే సమయం వచ్చింది. అడవిలో జంతువులన్నీ తన ఓటు హక్కుని సద్వినియోగం చేసుకున్నాయి. ఆ తరువాత రోజు రాజైన ముసలి సింహం తన మంత్రితో పోటీ చేసిన ఇద్దరి జాబితాలోనూ లెక్కింపు చేసి, అందులో ఎక్కువ ఓట్లు వచ్చినవి సుబుద్ధి అయిన కుందేలు. దానితో కుందేలుని ఆ సింహం రాజుగా నియమించింది. దీంతో జంతువు లన్నీ ఆనందించాయి. సింహం కుందేలుని ఇలా అంది 'నాకేంటి అని అడిగేవాడు నాయకుడు కాలేడు. నీకేంటి అని అడిగేవాడు మాత్రమే నాయకుడు అవుతాడు' అని తన రాచరికపు బుద్ధి తో చెప్పింది సింహం. కుందేలు రాజు అయి జంతువుల అవసరాలన్నీ తీర్చి వాటికి చేదోడు, వాదోడుగా ఉండి మంచి రాజుగా అనిపించుకుంది సుబుద్ధి.

– బల్ల కృష్ణవేణి




## బాలగేయం

### తెలుగు భాష



| | | | |
|---|---|---|---|
| అ | ఆ | ఇ | ఈ |
| ఉ | ఊ | ఋ | ౠ |
| ఎ | ఏ | ఐ | ఒ |
| ఓ | ఔ | అం | అః |

అచ్చమైన తెలుగు భాషరా
మచ్చలేని మంచి భాషరా
తూర్పుచాళుక్య రాజురా
రాజరాజ నరేంద్రుడురా
సంస్కృత భారతాన్ని
తెలుగులో రాయమరెరా
ఆదికవి నన్నయ భట్టురా
ఆదిసభ అరణ్యపర్వ
శేషం రాసి మరణించెరా
కవి బ్రహ్మ తిక్కనరా
అచ్చ తెలుగున రాసెరా
ప్రబంధ పరమేశ్వరుడురా
అరణ్య పర్వశేషమురా
అద్భుతంగా పూరించెరా
కవిత్రయం కలమందురా
మహాభారతమ్మేరా
జయ కావ్యమై వెలసెరా
ఆంధ్రులందరి చేతరా
భళా భళీ అనిపించెరా.

**- గుండాల నరేంద్రబాబు**

## హలో ఫ్రెండ్...


**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.క్రాంతికుమార్,** నిడదవోలు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వజ్రాలు ఎందుకు సానబెడతారు?




**జవాబు: క్రాంతికుమార్!** ముడి స్థాయిలో ఉన్నప్పుడు సాధారణ గాజుముక్క మాదిరిగా కనిపించే వజ్రం కళ్లు మిరుమిట్లు గొలపాలంటే సాన పెట్టవలసిందే. వజ్రానికి చెందిన వివిధ ముఖాల నుంచి కాంతి పుంజాలు విరజిమ్మటానికీ, వివిధ రంగులు కనువిందు చేయటానికీ ఇదే కారణం. ఒక వజ్రం ఇష్టపడే ఆకారం అనేది వ్యక్తిగత అభిరుచుల మీద ఆధారపడి ఉంటుంది. చాలామంది మాత్రం గుండ్రంగా వుండే వాటినే ఇష్టపడుతుంటారు.

**- పి.మధులిక,** ఎమ్మిగనూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. చెవిలో గులిమి ఎలా ఏర్పడుతుంది? ఎందువల్ల?

**జవాబు: మధులిక!** మనం తినే ఆహార పదార్థాలు, చెవి నిర్మాణాన్ని అనుసరించి గులిమి ఏర్పడుతుంది. వాస్తవానికి చెవిని మనంతట మన శుభ్రపరచాల్సిన అవసరం ఏమాత్రం లేదు. ప్రకృతి పరంగా దానంతట అదే శుభ్రపరచుకుంటుంది. ఆ ప్రక్రియలో భాగంగా గులిమి ఏర్పడి, చెవిలో నుంచి వెలుపలికి వస్తుంది. చెవిలోని సున్నితమైన భాగాలను ఇన్ఫెక్షన్ నుంచి కాపాడేందుకు గులిమి సాయపడుతుంది. ఇది సాధారణంగా ఉండాల్సిన స్థాయి కంటే ఎక్కువ వున్నా, తక్కువ వున్నా ఇబ్బందే. ఇయర్ కెనాల్ బయటి భాగంలో ఉండే ప్రత్యేక గ్రంథులు గులిమిని తయారు చేస్తాయి. బయటి నుంచి చెవిలోకి ప్రవేశించే దుమ్ము, ధూళి కణాలు చెవి లోపలి భాగాలను చేరకుండా ఇది అడ్డుకుంటుంది.





# సుగంధ ద్రవ్యాలకు భారత్ ప్రసిద్ధి

రావుశ్రీ

**సుగంధ ద్రవ్యాలకు నిలయంగా భారతదేశం కొన్నివేల సంవత్సరాల నుంచి పేరుగాంచింది. ఈ భూమి మీద మానవ నాగరికత ప్రారంభం నుంచే మనదేశంలో మూలికలు, సుగంధ ద్రవ్యాలు వాడినట్లు చరిత్ర చెబుతుంది. భారతదేశం నుంచి భారీ ఎత్తున సుగంధ ద్రవ్యాలు తరలించేందుకు ఆనాడే బాబిలోనియన్లు, రోమన్స్, ఈజిప్షియన్లు, చైనీస్, పోర్చుగీస్, బ్రిటిష్ వారు ప్రయత్నం చేసి, దోచుకుని పోవడం జరిగింది.**

సముద్రయానం ఖరీదైన ఆ రోజుల్లో కూడా భారతదేశం నుంచి సుగంధద్రవ్యాలు తరలించేందుకు అనేకమంది రాజులు ప్రోత్సాహంతో ప్రసిద్ధి చెందిన సముద్ర నావికులు ఫెర్డినాండ్ మాజిలాన్, క్రిస్టోఫర్ కొలంబస్, వాస్కోడిగామా పెద్దపెద్ద నౌకలతో భారతదేశం వచ్చి సుగంధ ద్రవ్యాలు తరలించారు. వీరిలో 1498లో 'కోజికోడ్'లో కాలుమోపిన వాస్కోడిగామా పెద్ద ఎత్తున వారి దేశానికి తరలించారు. వీటిలో ముఖ్యంగా లవంగాలు, జాజికాయ, దాల్చిన చెక్క, అల్లం, మిరియాలు మొదలగునవి. ఆ విధంగా సుగంధ ద్రవ్యాలు తరలించేందుకు అనేకమంది వలసవాదులు భారతదేశంపై ఆధిపత్యం కోసం నిరంతరం ప్రయత్నాలు చేసారు. చతుర్వేదాలలో సుగంధ ద్రవ్యాల ప్రస్తావన ఉంది. మంత్రాలు జపించే సమయంలో కొన్ని సుగంధద్రవ్యాల పేర్లు వల్లించేవారు. ఋగ్వేదం, యజుర్వేదంలో నల్లమిరియాల ప్రస్తావన ఉంది. పర్వతోపారణ ప్రదేశాలు, ఉష్ణమండల అడవులు, చిత్తడి నేలలు, సారవంతమైన నేలలు, పొలాలు పుష్కలంగా ఉండడం వల్ల సుగంధ ద్రవ్యాలు విరివిగా పండుట జరుగుతుంది. భారతదేశ వంటకాల్లో సుగంధ ద్రవ్యాలు లేకుండా ఉండవు అంటే అతిశయోక్తి కాదు. దాదాపు ప్రతీ భారతీయుల వంటగది సుగంధ ద్రవ్యాలు సువాసనతో గుప్‌మంటుంది. గ్రీకు, రోమన్ నాగరికత కంటే ముందు కాలంలోనే భారతదేశంతో మొసపటోనియా, ఈజిప్టు, అరబ్ దేశాలతో సుగంధ ద్రవ్యాలు వర్తక, వ్యాపార సంబంధాలు ఉండేవని చరిత్ర చెబుతుంది. గ్రీకు వ్యాపారవేత్తలు భారతదేశంలోని వివిధ పోర్ట్ పట్టణాలకు వచ్చి, మార్కెట్ల ద్వారా భారీ ఎత్తున సుగంధ ద్రవ్యాలు కొని వారి దేశానికి తరలించేవారు. పార్థియన్ యుద్ధాలు సుగంధ ద్రవ్యాల తరలింపులో వాణిజ్య మార్గాల కొరకు జరిగాయి అని తెలుస్తుంది. అరబ్‌దేశాల ఆర్థిక వనరుగా దాల్చిన చెక్క వంటివి వాడుతున్నట్లు చరిత్ర చెబుతుంది. ముఖ్యంగా మనదేశంలో సుగంధ ద్రవ్యాలకు పేరుగాంచిన రాష్ట్రం కేరళ. ఇడుక్కి, వాయినాడ్ వంటి ప్రాంతాల సుగంధ ద్రవ్యాల పంటకు అత్యంత అనుకూలమైనవి. సిల్క్‌రోడ్డు ద్వారా భారతదేశం నుంచి వివిధ దేశాలకు సుగంధ ద్రవ్యాల వ్యాపారం జరిగింది.



ఆయుర్వేదం మందుల తయారీలో సుగంధ ద్రవ్యాల, మూలికలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అరబ్, పెర్షియన్, యూరోపియన్ వలసవాదులు భారతదేశంపై ఆధిపత్యం కోసం నిరంతరం ప్రయత్నాలు చేసి, అందినమట్టుకు తరలించారు. దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సుగంధ ద్రవ్యాల పంటలకు, రైతులకు ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి పెరిగే విధంగా, రైతులకు అవగాహన కల్పిస్తూ లాభసాటిగా ఉండేటట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ❑



# టెక్నాలజీతో మరింత ఆరోగ్యం

మారుతున్న టెక్నాలజీపరంగా మానవ అవసరాలను, ఆరోగ్య సమస్యలను తీర్చే సరికొత్త టెక్నాలజీ పరికరాలు కూడా చాలానే వస్తున్నాయి. అందులో ఎన్నోరకాల పరికరాలను చూసుంటాం. మోకాళ్ల నొప్పులను, వినికిడి లోపాలను సరిచేసేటువంటి వీటిని మీరెప్పుడైనా వాడటంగానీ, చూడటంగానీ చూశారా!

## మోకాలి నొప్పులకు చెక్

ఆటలాడేటప్పుడు గాయాలు కావడం వల్ల కొందరు మోకాలి నొప్పుల బారినపడుతుంటారు. ఇంకొందరు కీళ్ల అరుగుదల వల్ల మోకాళ్ల నొప్పులతో





బాధపడుతుంటారు. నొప్పులు తగ్గడానికి రకరకాల మందులు వాడుతుంటారు. కాపడాలు పెట్టించుకుంటుంటారు. వీటివల్ల వచ్చే ఉపశమనం అంతంత మాత్రమే! మోకాలి నొప్పుల నుంచి సత్వర ఉపశమనం కలిగించేందుకు అమెరికన్ కంపెనీ 'నీ ఫ్లో' హెల్మెట్ ఆకారంలో ఉన్న ఈ మసాజర్‌ను రూపొందించింది. ఇది రీచార్జబుల్ బ్యాటరీ సాయంతో పనిచేస్తుంది. మోకాలికి దీనిని బిగించి కట్టుకుని, దీనికి ఉన్న స్విచ్‌ను ఆన్ చేసుకుంటే చాలు. దీని లోపలివైపు నుంచి కాంతి, వేడి వెలువడటమే కాకుండా, లయబద్ధంగా వెలువడే ప్రకంపనలు మోకాలి కీళ్లకు కండరాలకు మర్దన చేస్తాయి. దీనివల్ల వాపు, నొప్పి ఉన్న భాగాల్లో రక్తప్రసరణ మెరుగుపడి నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే కీళ్ల కదలికలు త్వరగా చురుకుదనాన్ని పుంజుకుంటాయి. 'నీ ఫ్లో'మసాజర్ మోకాలి ఉపరితలానికి మాత్రమే కాకుండా, లోపలి భాగాలకు కూడా ఫిజియో థెరపీ అందిస్తుంది. దీని ధర రూ.20,775.

## కళ్లకు జోడు చెవులకు తోడు

ఇది కళ్లజోడులా కనిపిస్తుంది. అలాగని కేవలం కళ్లజోడు మాత్రమే కాదు, వినికిడి సమస్యలు ఉన్నవారి చెవులకు తోడు కూడా. అంటే, ఇది స్పెక్టకిల్ కమ్ హియరింగ్ ఎయిడ్ అన్నమాట. జర్మన్ కంపెనీ 'ఆడియా ఆకాస్టిక్' ఈ స్పెక్టకిల్ కమ్ హియరింగ్ ఎయిడ్‌ను 'బ్రకాఫ్' బ్రాండ్ పేరుతో 'స్పెక్టకిల్ ఎయిడ్'గా రూపొందించింది. దృష్టిలోపాలు, వినికిడి సమస్యలు రెండూ ఉన్నవారికి ఇదొక వరమనే చెప్పాలి. ఇందులోని కళ్లద్దాలు దృష్టిని స్పష్టం చేస్తాయి. కళ్లజోడు చెవులకు పెట్టుకునే భాగంలో చివరివైపు ఉన్న హియరింగ్ ఎయిడ్ శబ్దాలను స్పష్టంగా వినేందుకు దోహదపడుతుంది. మిగిలిన హియరింగ్ ఎయిడ్ పరికరాల మాదిరిగా దీనిని చెవి లోపల పెట్టుకోనవసరం లేదు. మామూలు కళ్లజోడు తొడుక్కున్నట్లే పెట్టుకుంటే సరిపోతుంది. దృష్టి లోపాలు లేకుండా వినికిడి సమస్యలు మాత్రమే ఉన్నవారు జీరో పవర్ గ్లాసెస్‌తో తీసుకుని, దీనిని తొడుక్కుంటే చాలు. కోరుకున్నంత ధ్వనిలో శబ్దాన్ని వినేందుకు వీలుగా ఇందులో అడ్జస్ట్‌మెంట్స్ చేసుకునే వెలుసుబాటు కూడా ఉంది. దీని ధర రూ 51,593.

### కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

కథ

# అనురాగ క్రమం

వడలి రాధాకృష్ణ

సుబ్బరాజు కొడుకు రత్నరాజు. చిన్నతనం నుండే వాడు ఒక సంచలనం. అమ్మ కడుపులో పడ్డప్పుడే అక్షరాలను అవపోసన పట్టేడేమోనని అందరికీ ఆశ్చర్యంగా ఉంది.

రిక్షా తొక్కి పొట్ట పోసుకొనే సుబ్బరాజు రత్నంగాడేమిటి!! అంత చిన్న వయసులోనే ఇస్కూలులో క్లాసు ఫస్టు మార్కుల్ని కొట్టేశాడు.

ఈ వార్త ఊరంగా పాకి అందరూ ఆశ్చర్యపోయేలా చేస్తూ ఉంది.

"ఆ చిన్న ఊరిలో ఉన్న అన్ని లింగాలలోను బోడిలింగంగాడు వీడు" ఇలా అనుకున్నవారూ ఉన్నారు. అయితే కొందరికి రత్నరాజును చూస్తే కంటిలో నలుసులాగ అన్పిస్తూ ఉంది.

"సుబ్బడుగాడిలాగ రత్నగాడిని గూడురిక్షా కాకపోయినా ఆటో వేసుకోమను! బ్యాంక్‌లోను ఇప్పిస్తాను. బాగా గిట్టుబాటవుతుంది. బ్యాంక్‌లో చెప్పి లోన్ ఏర్పాటు చేయిస్తాను" ఊరి కామందు కూర్మారావు సలహా ఒకటి పారేశాడు.

రిక్షాలాగే సుబ్బరాజుకి కామందు గారి సలహా అంటే గొప్ప గురి. ఊరి పెద్ద సలహా కాదంటే పుల్లేటికుర్రు రోడ్డు మీద తన గూడురిక్షాబండి తిరిగే అవకాశమే ఉండదు మరి. తన రిక్షా టైరుబండికి పంచరు పడితే ప్యాచీ వేసేవాడే ఉండడు. అందుకే ఆటోరిక్షా కొనుగోలుకి వెంటనే బ్యాంక్ లోనుకని పరుగులు తీశాడు.


"నీ యవ్వ నీ కొడుకు ఇంకా బుల్లిబాబే కదరా! పెరగనీ... పెరిగి పెద్దవ్వనీ!! నీకు ఎలాగూ మీసాలు లేవు. ఆడికయినా మీసాలు మొలవనీ. అప్పుడు రత్నం గాడికి బ్యాంక్‌లోన్ దొరుకుతుంది. ఆ సహాయం చేసి పెట్టగలడు ఈ ఈరడు".

ఆ క్షణంలో ఈరడు సుబ్బడు కంటికి శ్రీకృష్ణ పరమాత్ముడిలాగ అగుపించాడు. ఈరడు పుల్లేటి కుర్రులో చోటా మోటా నాయకుడు. అందరికీ, అన్ని పార్టీలకీ కమీషన్ తీసుకొని పనులు చేసి పెడుతుంటాడు.

అప్పట్లో సుబ్బడు తొక్కే గూడురిక్షాబండి బాడీకి బొక్కలు పడిపోయాయి, రిమ్ములకు చిల్లులు పడిపోయాయి.

సుబ్బడు బండి ఎక్కినాడంటే నానా అవస్థలు పడేవాడు. సరిగ్గా అప్పుడే ఈరడు పుణ్యమా అంటూ బ్యాంక్ లోనుపై కొత్త గూడురిక్షాని బిగించేశాడు.

"నాన్సోయ్! నేనూ ట్రిప్పులు వేసేదా?"



"నా బండిమాలచ్చిమి నాది! రేపు నీ ఆటోమాలచ్చిమి నీది!! నా గూడుబండిని నేనే తొక్కాల. నా హాండిల్‌బారు పట్టినా, బ్రేకుల మీద చేతులేసినా, పెడలు మీద కాలేసినా తొక్క లేచిపోగలదు... కాళ్లు ఇరిగిపోగలవు" కొడుకును కాసింత గట్టిగానే గద్దించాడు.

తండ్రి గద్దింపులు ఆ బుడతడికి లెక్క లేదు.

"కొడుకు బండి పడతానంటే కాదన్నోడిని నిన్నే చూశాను. అయినా ఆడికి అది ఆటగానీ, రేపు పట్నం రిజిస్ట్రారు ఆఫీసులో ఆడు పెద్ద గుమాస్తా అయిపోడా సెప్పు!" రాగాలమ్మ మొగుడి మీద గయ్‌మని లేచింది.

"నాన్నా! ఒ ట్రిప్పేస్తా!!" రత్నరాజు పోరు సుబ్బడుని ఉడికించేస్తోంది.

"కాదన్నాను" కొడుకు మీద కళ్లెర్రజేశాడు.

"ఆడంత సరదా పడుతుంటేను... నువ్వేంటయ్యా! రాగాలమ్మ పెనిమిటిని వారించబోయింది.

కొబ్బరికాయ కొట్టేసినావు. ఆనక ఆంజనేయ స్వామికి మంచి చేసేసినావు. మొదటి ట్రిప్పు అయిపోయింది కదా! నేనో ట్రిప్పు వేసి వస్తాను.

అంతే! సుబ్బడు గారి బుర్రలోని ఆవేశం చేతుల్లోకి తర్జుమా అయిపోతోంది. రత్నరాజు పెడలు మీద కాలేసి సీటు మీదకి ఎక్కేయబోయాడు. కొడుకు జుట్టు పట్టుకొని అమాంతం కిందకు లాగి పారేశాడు. కింద పడిన రత్నరాజును చేతులతో కుమ్మేశాడు.

రాగాలమ్మ వారించబోయింది.

ఆమెను దూరంగా నెట్టి పారేశాడు. "నా రిచ్చా మాలచ్చిమిని నడుపుతానంటే గిట్టదు నాకు. చివరికి కొడుకయినా సరే" సుబ్బడులోని ఉడుకుమోత్తనం, ఉద్రేకం అన్నీ కట్టలు తెంచుకొని వచ్చేశాయి. కిందపడి ఒళ్లంతా మట్టి కొట్టుకుపోయిన రత్నంగాడు వలవలా ఏడిచాడు.

సుబ్బడులో పెల్లుబికిన ఉద్రేకం

తనను మనిషిలాగ ఉండనీయడం లేదు. అదిమిపట్టేసి ఆ దవడ ఈ దవడ వాయించేశాడు. జుట్టు పట్టుకొని కొడుకు బుర్రని నేలకేసి కొట్టేవాడు.

సుబ్బడిని వారించడం రాగాలమ్మ వల్ల కావడం లేదు.

తేరుకున్న రత్నంగాడే తృటిలో తప్పించుకొని అదేపనిగా పరుగు లంకించుకున్నాడు.

అవును.. తన గూటి రిక్షా తన స్వంతం. తన సెంటిమెంటూను. దాన్ని మరొకరు తొక్కడం సుబ్బడుకు అస్సలు ఒప్పనే ఒప్పదు.

................

రిక్షా సుబ్బడు కొడుకు రత్నరాజు ఎప్పుడూ సంచలనమే! పనిలో సంచలనం, ఆటపాటలలో సంచలనం, పరాయివారికి సహాయపడటంలో సంచలనం, ఇక చదువులో అయితే మహా సంచలనం! చిన్నప్పటి నుండి ఇప్పటిదాకా ప్రతి క్లాసులోను మంచి మార్కులు సాధించి సంచలనాలు సృష్టిస్తున్నాడు.

ఇప్పుడు కళాశాల స్థాయి పరీక్షలలోను ఫస్టు మార్కులే!

సామాజిక పరంగా కడు బీదవాడు. రిక్షా లాక్కుంటూ రోజువారీ బాడుగలతో పొట్ట పోసుకునే ఓ బడుగు తండ్రి కడుపున పుట్టిన కుర్రాడు ఇంత చక్కగా చదువుకొని మంచి మార్కులతో పాసవగలగడం నిజంగా చాలా గొప్ప విషయం" అంటూ ఒకటి రెండు సార్లు పెద్ద పెద్ద పత్రికలలో కూడా పరిచయం చేస్తూ రాశాయి.

చదువు మీద అతగాడి దృష్టి భవిష్యత్ మీద రత్నరాజుకున్న గురి.. జీవితం పట్ల మమకారం, శ్రద్ధలు చూసి కన్న తల్లిదండ్రులు పొంగిపోతున్నారు.

వాడికొచ్చిన మార్కులు, ఇచ్చిన స్కాలర్‌షిప్‌ల పుణ్యం వల్ల రిక్షా

**"వస్తావా? మీ ఇంటి దగ్గర దిగబెడతాం!!" అన్నారు స్థానికులు. అమ్మా నాన్నల కోసం ఎదురు చూశాడు. ఎప్పుడూ పైన నామమాత్రమైన చొక్కా కూడా లేకుండా కట్టుపంచెలో మాత్రమే అగుపించే సుబ్బడు కోసం చూశాడు.**

సుబ్బడు కొడుకును చదివించడానికి పెద్దగా ఇబ్బంది పడలేదు.

పనికిమాలిన లింగాలలో బోడిలింగం అని ఎత్తిపొడిచిన నోళ్ల క్రమంగా ఇప్పుడు మూతబడిపోతూ ఉన్నాయి.

ఇప్పుడు కంట్లో నిజంగానే నలుగు పడ్డట్లు అన్పించేసరికి ఆవేదనను భరించడం కొందరి వల్ల కావడం లేదు.

................

రత్నరాజుకి చాలా ఉద్వేగంగా ఉంది. ఇన్ని సంవత్సరాల తన జీవితం ఎంత వాస్తవమైనా ఇప్పటికీ కలలాగ అన్పిస్తూ ఉంది తనకు.

ఆల్ ఇండియా లెవెల్లో సివిల్ సర్వీసెస్ ఎంట్రన్స్ రాసి ఫస్ట్ ర్యాంక్ సంపాదించుకున్నాడు. ఐఎఎస్‌లో సీటు సంపాదించుకొని ఇప్పుడు ఢిల్లీలో చదువు పూర్తి చేశాడు.

అది తనకు అమితమైన సంతోషాన్ని కలిగిస్తోంది. చెప్పాలంటే రత్నరాజుకి తన మీద తనకు నమ్మకముంది. ఆ నమ్మకం తాలుకు ఆత్మవిశ్వాసం తనను ఈ స్థితికి తీసుకురాగల్గింది.

మరునాడే ఫైనల్‌గా హాస్టల్‌ని ఖాళీ చేసి స్వంత ఊరికి వెళుతున్నాడు. కొన్నాళ్ల తర్వాత పిలిచి ఎక్కడో పోస్టింగ్ ఇస్తారు. ఇక అమ్మా నాన్నల కష్టాలు తీరిపోయినట్లే!

యాధృచ్ఛికమో లేక మరి ఏమిటో.. తెలవదుగానీ నాన్న వాహనం నాన్నకు ప్రాణం. అదే.. తన గూడురిక్షా మీద చేయి వేయనిచ్చేవాడు కాదు. ఎప్పుడైనా సరదాకు రిక్షాని తొక్కాలని ప్రయత్నిస్తే అంతవరకు సౌమ్యంగా మనిషిలా ఉన్నతను నిప్పుకణికగా మారిపోయేవాడు. అప్పుడు అతగాడిలోని కరుడుగట్టిన మనిషి తనపై కళ్లు ఎర్ర చేసేవాడు. అదేపనిగా ఊగిపోతూ పళ్లు పాపటా కొరికేవాడు.

ఒకసారి తన మీద చేయి చేసుకున్నా కూడాను. ఆ సందర్భాన్ని తల్చుకున్నప్పుడల్లా రత్నంజుకి నవ్వు ఆగదు. పడీ పడీ నవ్వుతాడు.

తండ్రి మనసులో ఏముందో తాను గ్రహించగలడు. తాను వస్తున్నట్లు పుల్లేటికుర్రులోని స్నేహితులకు, అమ్మా నాన్నలకు తెలియజేశాడు. ఐఎఎస్ పూర్తి చేసిన పుల్లేటికుర్రు కుర్రాడు అని స్వాగతం పలకడానికి గొప్పగా ఏర్పాట్లు చేసేశారు మిత్రులు.

అవన్నీ తల్చుకుంటే రత్నరాజుకు చాలా ఉత్తేజంగా ఉంది. తండ్రిలోని రిక్షాసుబ్బడు గుర్తుకు వస్తూ ఉన్నాడు. ఇంతవరకు ఆయనగారు పైన చొక్కా తొడుక్కోవడం చూడలేదు తాను. ఎప్పుడూ మాసిపోయిన కట్టుపంచెతో తన గూడురిక్షాయే తన లోకంగా బతికేవాడు.

................

గన్నవరం విమానాశ్రయంలో తనకోసమని స్థానికులు కారును ఏర్పాటు చేశారు. అక్కడి నుండి పుల్లేటికుర్రు ప్రయాణం రత్నరాజుకు అమితమైన ఆనందాన్ని కలుగజేస్తూ ఉంది.

"చాలా సంతోషం రాజూ! మన ఊరికి గర్వకారణం నువ్వు. సాయంత్రం ఊరి పంచాయితీ ఆఫీసు దగ్గర నీకు అభినందన సభను ఏర్పాటు చేశాం. స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి గార్లను అతిథులుగా ఆహ్వానించడం జరిగింది. నువ్వు, తల్లిదండ్రులతో వచ్చి తప్పక పాల్గొనాలి" అన్నారు.

స్థానిక పెద్దల ఆదరణ రత్నరాజుకు ఆనందాన్ని ఇస్తోంది.

"వస్తావా? మీ ఇంటి దగ్గర దిగబెడతాం!!" అన్నారు స్థానికులు.

అమ్మా నాన్నల కోసం ఎదురు చూశాడు.


## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:**

**నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**

**sunmagvaartha@gmail.com**

ఎప్పుడూ పైన నామమాత్రమైన చొక్కా కూడా లేకుండా కట్టుపంచెలో మాత్రమే అగుపించే సుబ్బడు కోసం చూశాడు రత్నరాజు.

అంత మందిలో ఎక్కడా కానరావడం లేదు తండ్రి.

"కలెక్టరు గారి తండ్రి సుబ్బడు గారు నీ పక్కనే ఉన్నారోయ్!" స్నేహితుడు రాజేశ్ చెబితేనేగాని తెలియరాలేదు.

తేరపార చూశాడు. పట్టు కట్టుపంచెతో, పైన అదే రంగు చొక్కాతో, ఆ పైన పట్టు కండువా ధరించి ఉన్న సుబ్బడు.

రాణిరంగు పట్టు చీరెలో నిండుగా ఉండి మెరిసిపోతున్న అమ్మ...

చాలా వింతగా ఆశ్చర్యంగా సంతృప్తిగా అన్నిస్తోంది రత్నరాజుకు.

"వద్దన్నా సరే కూర్మారావు అయ్యగారు కొనిపెట్టేసినారు" సిగ్గు పడుతూ చెబుతున్నాడు సుబ్బడు.

అమ్మా నాన్నలను ప్రేమతో నవ్వుతూ దగ్గరకు తీసుకున్నాడు. వాళ్ల కళ్లలోని ఆనందం చూసి పులకించిపోతూ ఉన్నాడు.

"అయినా మీ నాయన ఇప్పుడు కూడా గూడు రిక్షా తొక్కుకుంటూనే వచ్చినాడయ్యా!" పక్కనున్న పెద్దమనిషి పరాచకాలాడుతున్నాడు.

"కారు రెడీగా ఉంది సార్" డ్రైవర్ పిలుస్తూ ఉన్నాడు.

ఆ పిలుపు ఎందుకో రత్నరాజుకు రుచించడం లేదు.

"మరల నన్ను చితక్కొడతావా?" నవ్వుతూ తండ్రి ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"... ... ..."

"అదే మరల కిందకు నెట్టిపారేసి కుమ్మేస్తావా?" బిడ్డడి పలుకులు రాగాలమ్మకు అర్థం అవుతూనే ఉన్నాయి.

"ఆయన గారిది మట్టిబుర్ర. ఏమీ అర్థం కాదులే!!"

"చెప్పు... ఇప్పుడు మరల నన్ను కొడతావా?" సుబ్బడు సిగ్గుతో కుంచించుకుపోతున్నాడు.

అక్కడ అందరికీ ఆశ్చర్యంగా ఉంది. సుబ్బడు సిగ్గుతో వంకీలు తిరిగిపోతున్నాడు.

రాగాలమ్మకూ అలాగే ఉంది. వారిని అంటిపెట్టుకొని ఉన్న రత్నరాజుకు మటుకు మహా సంతోషంగా ఉంది. ఆ పైన సంతృప్తిగా అన్పిస్తూ ఉంది.

"కారు రెడీగా ఉంది సార్" డ్రైవర్ పిలుస్తూ ఉన్నాడు.
ఆ పిలుపు ఎందుకో రత్నరాజుకు రుచించడం లేదు.
"మరల నన్ను చితక్కొడతావా?" నవ్వుతూ తండ్రి ముఖంలోకి చూస్తూ అన్నాడు.

అక్కడకు వచ్చి గుమిగూడిన ఊరిజనాల సమక్షంలో రత్నరాజు ఒక్కసారిగా రిక్షాపుల్లర్ అయిపోతున్నాడు.

జన్మనిచ్చిన అమ్మా నాన్నలను ప్రేమగా తండ్రి గూడురిక్షాలో కూర్చోపెట్టుకున్నాడు. తానే రిక్షా తొక్కుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు.

అపురూపమైన దృశ్యమేదో ఆవిష్కృతమయ్యేసరికి చప్పట్లతో ఆ ప్రాంతం మార్మోగిపోతూ ఉంది.

రిక్షాపుల్లర్ రత్నరాజు రిక్షా తమ ఊరి పాక వైపు సాగిపోతూ ఉంది.

"కాబోయే కలెక్టరు రత్నరాజు రిక్షా త్రిప్పు వేస్తున్నాడర్రో!"

జనాల అరుపులు ఆనందాన్ని కలుగజేస్తున్నాయి. అక్కడివారి చప్పట్లు లయాత్మకంగా ఉన్నాయి.

ఆ చప్పట్ల హోరులో రత్నరాజు రిక్షాబండి మరింత వేగాన్ని సంతరించుకుంటూ తమ పేదల బస్తీ వైపు చైతన్యానికి చిరునామా సాగిపోతోంది. ●

జోక్స్

## ఇక్కడికెందుకు వచ్చావు?

డాక్టర్: నీ కాలు బాగా బెణికింది. అర్జంట్‌గా ఆపరేషన్ చెయ్యాలి.

పేషెంట్: దీనికి ఆపరేషన్ ఎందుకు? నూనెతో మర్దన చేస్తే సరిపోతుంది కదా! మా వీధిలో ఒకామె మర్దన చేస్తుంది.

డాక్టర్: మరి ఇక్కడికెందుకు వచ్చావు? అక్కడే చేయించుకోకపోయావా?

పేషెంట్: ఆమె ఊరికి వెళ్లింది.

**– ఎస్.కె.యాకుబ్ పాషా,**
ఖమ్మం

## భయం చెప్పింది..!

సుబ్బారావు: అప్పారావ్! నిన్న మీ ఇంటి పక్క నుండి వెళ్తున్నప్పుడు పెద్ద అరుపులు వినిపించాయి. ఏమైంది? ఏమైనా సమస్యా?

అప్పారావు: మా ఆవిడ నాకు భయం గురించి చెప్పింది..

సుబ్బారావు: అంటే?

అప్పారావు: హెడ్ మాస్టర్ ఒకటవ తరగతి కుర్రవాడికి భయం చెప్పినట్టు నాకు మా ఆవిడ భయం చెబుతుంది.

సబ్బారావు: ఆ... అంటూ నోరెళ్లబెట్టాడు.



## పెద్ద పేరున్న హోటల్?

ఓ పల్లెటూరి వ్యక్తి ఏదో సొంత పని మీద పట్నం వచ్చాడు. పని పూర్తయ్యేసరికి భోజన సమయం అయింది. దారిలో కనిపించిన వ్యక్తిని ఆపి "ఇక్కడ పెద్ద పేరున్న హోటల్ ఏది?" అని అడిగాడు.

"వీర వెంకట సత్యనారాయణ కనకదుర్గ విలాస్" అని చెప్పి వెనక్కి చూడకుండా వెళ్లిపోయాడా వ్యక్తి

## అత్తారింటికి!

"భర్త భార్యను కొడితే పుట్టింటికి వెళ్తుంది. మరి భార్య భర్తను కొడికి ఎక్కడికి పోవాలి సార్?" అడిగాడు అప్పారావు లాయర్‌తో.

"అత్తారింటికి" అన్నాడు లాయర్.

**– వైదా ఈశ్వరరావు,**
విశాఖపట్నం

# వందేళ్ల తెలుగు కథకు వందనం

జయసూర్య




అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు (1889-1942) మహాకవి, గురజాడ వేంకట అప్పారావు సమకాలికులు. 1914లో వావిళ్ళవారు, త్రిలింగ పత్రిక స్థాపించారు. ఆ పత్రిక వ్యవస్థాపకులు అయిన అక్కిరాజు ఉమాకాంతం 1912-14 మధ్య కాలంలో కలకత్తాలో విద్యాభ్యాసంలో నాటి వంగ సాహిత్య పురోగమనాన్ని పరిశీలించారు. తెలుగు భాష, సాహిత్యాలు రాజాశ్రయాల కాలంలో పొందిన భోగభాగ్యాలు, కీర్తి ప్రతిష్ఠలు క్రమేపీ సన్నగిల్లడంతో తెలుగు భాషకు ఆ రోజులలో క్షీణ దశ ప్రారంభమైంది. తెలుగు పట్ల మమకారం, ఆదరణ, భాషాభిమానం తగ్గిపోతున్న కాలం అది. తెలుగు భాష, సాహిత్యం ఎప్పుడూ రాజాశ్రయాలలో సంస్థానాలలో అందలాలతో నాటి రాజ్యాధికారం అండదండలతో పల్లకీలలో ఊరేగుతున్న రోజులు యిక నిష్క్రమించడంతో తెలుగు సాహితీవేత్తలు, నాటి కవులు తెలుగును స్వీయ వ్యక్తిత్వంతో బతికించుకొనే కృషి ప్రారంభించవలసిన ఆలోచనలు అంకురిస్తున్న కాలం అది. అప్పటివరకు సంస్కృతం ఆధిపత్యం కొనసాగి, ఆంగ్ల పాలన కారణంగా దేశీయ భాషలపై ఆంగ్ల భాషాధిపత్యం, ప్రభావంతో సాహిత్య సృష్టికి ప్రారంభ కాలం అది. ఇంతలో, ఆంగ్ల విద్యా విధానం ప్రవేశించింది. మాధ్యమంగా తెలుగును మర్యాదా, మన్ననతో ఆదరించుకోవాలనే తపన, అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖర కవి వంటి రచయితలకు కలిగింది. నాడు తెలుగుకు పట్టిన 'తెగులు'పై అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరుడు తొలి తరం కథా రచయితలలో ఒకరిగా 'ఎదుగని బిడ్డ' శీర్షికన రాసిన కథ 1914 మే సంచిక త్రిలింగలో ప్రచురితమైంది. ఈ కథ అక్కిరాజు ఉమాకాంతం ప్రచురింపచేసి శతాబ్దం అయింది. ఈ కథ ప్రతీకాత్మకమైంది. ధ్వన్యాత్మకంగా తెలుగుతల్లి తన ఆవేదనను మొరపెట్టుకొన్న వాస్తవ దృశ్యం కథా రూపంలో అక్కిరాజువారు కళ్లకు కట్టించారు. 'తొలి మలితరం తెలుగు కథల సంకలనం', బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, ప్రముఖ సాహితీవేత్త లబ్ద ప్రతిష్ఠులు డా॥ అక్కిరాజు రమాపతిరావు సారధ్యంలో ఈ కథ మళ్లీ వెలుగు చూసింది. 1913 నాటి ఈ కథ, విపుల 2007 డిసెంబరు సంచికలో వచ్చింది.

### తెలుగు సాహిత్యంలో తొలి కథా రచన

తెలుగు సాహిత్యంలో విక్రమార్క, భోజరాజు, గులేబకావళి, చిలుక కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, తాతాచారి కథల వంటి పుస్తకాలెన్నో ముద్రణా సౌలభ్యం కారణంగా అచ్చుకు ఆనాడే నోచుకున్నాయి.

సమకాలీన జీవితానికి, సామాన్యుల సమస్యల ఆధునిక కథకు 1898 తర్వాతనే అంకురార్పణ అయింది. 1910 ఫిబ్రవరి ఆంధ్రభారతిలో ప్రచురితమైన గురజాడవారి 'దిద్దుబాటు'కు ముందే 1901, 1902 సంవత్సరాల్లో బండారు అచ్చమాంబ 'లలితా శారదలు' ధన త్రయోదశి కథలు రాసిన తెలుగు కథకు ఆమెను ఆద్యురాలిగా సంభావించవచ్చు.

1912 జనవరిలోనే మాడపాటి హనుమంతరావు రాసిన 'హృదయ శల్యము' అచ్చయింది. 1905లో తణుకు నుంచి వెలువడిన సువర్ణలేఖ వారపత్రికలో వెదురుమూడి శేషగిరిరావు శ్రీకారం చుట్టిన మదరాసు కథల సంపుటి లభ్యం కాలేదు. వెదురుమూడి తొలి కానుకగా సమర్పించిన కథ పేరు 'మన పద్ధతులని తరులెట్లు భావించుచున్నారు'. ఈ కథ 1909లో కానీ అంతకు కొంచెం అటు ఇటుగా వచ్చి ఉండవచ్చు. పేరునుబట్టి తెలుగు కథా సాహిత్యానికి అది తొలి దశ అయి వుండవచ్చు. నాటి సమాజంలో అవిద్య, మూఢత్వం, అజ్ఞానం, దురాచారం విద్యాధికులను కూడా పీడించడం ఇతివృత్తంగా 'వెదురుమూడి' ఈ కథ రాసారు. అంతకుముందే బండారు అచ్చమాంబ సంఘ సంస్కరణల ప్రభావంతో, సరళ శైలిలో ఆధునిక కథా వైతాళిక రచయిత్రిగా గుర్తింపు పొందారు. 1901లో తెలంగాణలో గ్రంథాలయోద్యమాన్ని ప్రారంభించిన కొమర్రాజు లక్ష్మణరావు సోదరిగా ఆమె సామాజిక, రాజకీయ స్పృహతో కథలు రాసారు.

తొలి మలి తరం కథా రచయితలలో కొందరు వాడుక భాషలో కాకుండా గ్రాంథికలో రాసినా శైలి సరళంగా వ్యవహార భాషకు సన్నిహితంగా వుండటం విశేషం. గురజాడకు ముందే తెలుగు కథకు ఆచంట సాంఖ్యాయన శర్మ రూపురేఖలు చేకూర్చారు. 1903 నాటికే తాము నడుపుతున్న 'కల్పలత' పత్రికలో 'అపూర్వోపన్యాసం' కథ రాశారు. ఈ విధంగా గురజాడ కన్నా ముందుగానే నలుగురైదుగురు కథా రచయితలు, ఆయనకు సమకాలిక రచయితలు ఉన్నారు. ఏది ఏమైనా తెలుగు కథ శత జయంతికి సుమారు రెండు దశాబ్దాలకు ముందు నుంచే కథారచన వెలుగు చూసింది. సాంఘిక ప్రయోజనం లక్ష్యంగా వ్యవహారిక శైలితో విద్యావికాసం ద్వారా సామాజిక మత ఛాందసత్వం తొలగిపోగలదని నాటి తొలి రచయితలు ఆశించారు. కథా రచన అద్వితీయంగా కొనసాగించారు.

ఆధునిక స్వరూప స్వభావాలతో తెలుగు కథ జన్మించి శతాధిక సంవత్సరాలు గడిచాయి. ఈ నూరు, నూట యాభై ఏళ్ళలో కథా ప్రక్రియను విశిష్ట రచయితలు ఎందరో ప్రతిభావంతమైన లక్షలాది కథలతో ఆధునిక, అధునాతన సమాజపు తీరుతెన్నులు, పరిణామాలు, పర్యవసానాలు, కష్టసుఖాలు, సమస్యలు ప్రతిబింబింపచేసారు. 1920 నాటికే కేవలం కథారచనకు ప్రాముఖ్యం యిచ్చిన కథల పత్రిక 'సాహితి' ప్రారంభమైంది. 20వ శతాబ్ది ప్రారంభంతో ప్రభవించి, 21వ ప్రస్తుత శతాబ్దిలో విశ్వరూపం ధరిస్తున్న తెలుగు కథలో, అభ్యుదయ, ఆధునిక, విప్లవ, అత్యాధునిక సృజనాత్మక సాహిత్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతూ నేటికీ మకుటాయమానంగా కథకు పట్టం కడుతోంది. తెలుగును బతికిస్తున్న తెలుగు కథకు సహస్ర వందనాలు.

యామిజాల జగదీశ్

# నిజమా.. అబద్ధమా

ఓమారు ఓ వ్యక్తితో అవీ ఇవీ మాట్లాడుతూ "ఎప్పుడూ నిజమే మాట్లాడాలి.. అదే మంచిది" అని చెప్పాను.

అందుకు అతను గొడవకు దిగాడు.

"ఏమిటో చెప్తున్నావు. నీ మాటలన్నీ విని మోసపోవటానికి ఎవరైనా సిద్ధంగా ఉంటే వారికి చెప్పు, నాకు చెప్పకు. నాకది అనవసరం, నన్నొదులు" అని అక్కడి నుండి వెళ్లిపోసాగాడు.

అయితే నేనూరుకుంటానా... లేదుగా. నేను అతనిని పట్టుకుని "విషయం ఏంటి?" చెప్పమన్నాను.

అతను చెప్పాడు...

"సార్, గత వారం సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌లో నేను ఒక సూట్‌కేస్‌తో నిల్చున్నాను. నా పక్కనే ఒక వ్యక్తి నిలబడ్డాడు. అతనితో "ఈ సూట్



కేసుని కాస్సేపు చూసుకోండి. అదిగో అక్కడికి వెళ్లి ఓ నీళ్ల బాటిల్ కొనుక్కొస్తాను" అన్నాను.

"సరే" అన్నాడతను.

నేను వెళ్లి నీళ్ల బాటిల్ కొనుక్కుని వచ్చాను. తీరా చూస్తే అక్కడ ఆ మనిషీ లేడు, నా పెట్టే కనిపించలేదు. అతను నా పెట్టెతో పాటు ఉడాయించాడు" అన్నాడతను.

"అయ్యో పాపం" అన్నాను నేను.

"నిజమే మాట్లాడాలని చెప్తుంటారు కదా, అందువల్ల వచ్చిన కష్టమే సార్" ఇది అన్నాడు.

"ఎలా?" అని అడిగాను.

"పెట్టెను చూసుకోమని నేను చెప్పినప్పుడు అతను "అందులో ఏముందని?" అడిగాడండి. నేను చెప్పానండీ. అందులో పదిహేను వేల రూపాయలు ఉన్నాయన్నాను" అంటూ అతను పోగొట్టుకున్నవన్నీ ఏకరువు పెట్టాడు.

నిజం మాట్లాడటం అనేది ఉత్తమమైన కార్యమే. అందులో ఏమాత్రం సందేహమూ లేదు. కానీ ధర్మం అనేది చాలా సూక్ష్మమైనది.

ఏది ధర్మం? ఏది అధర్మం? అని మనకు అర్థం కావడం లేదు. అందుకే నిజం మాట్లాడటం వల్ల చిక్కుల్లో పడుతుంటాం.

కౌశికుడు అని ఒక ముని ఉండేవాడు. ఈ మాట అన్నాను కదాని నీకు కౌశికుడు పరిచయమా? అని అడక్కండి.

ఆయన ఇప్పటి ముని కాదు. పురాణాల కాలపు ముని.

అబద్ధాలాడని ముని అని ఆయనకు పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఆయన ఓ అడవిలో ఉండేవారు.

ఒకరోజు కొందరు దొంగలు భయపడుతూ అటువైపుగా వచ్చారు. "ఏమిటి విషయం?" అని అడిగారు కౌశికుడు.

"కొందరు మమ్మల్ని తరుముకుంటూ వస్తున్నారు. వారి నుంచి తప్పించుకోవడం కోసం ఇటువైపు పరిగెత్తుకుంటూ వచ్చాం" అంటూ ఓ పొదలమాటున దాక్కున్నారు.

వారు దాక్కున్న చోటు కౌశికుడికి తెలుసు.

కాస్సేపటికి దొంగలు అక్కడికి వచ్చారు. కౌశిక మునిని చూసారు. ఆయన అబద్ధాలాడరని దొంగలకు తెలుసు.

"స్వామీ, మీరు అబద్ధాలు చెప్పరని తెలుసు. అందువల్ల మీరు మాకు నిజం చెప్పాలి. మమ్మల్ని చూసి భయపడి కొందరు ఇటు వైపుగా పరిగెత్తుకుంటూ వచ్చారని తెలుసు. ఇప్పుడు వారెక్కడ దాక్కున్నారో చెప్పండి" అని అడిగాడు దొంగలు.

ముని అబద్ధం చెప్పరు కదా. వెంటనే దొంగలకు భయపడి పారిపోయిన వచ్చినవారు ఎక్కడ దాక్కున్నారో వారికి చెప్పేశారు.

దొంగలు తిన్నగా అక్కడికి వెళ్లి వారిని హతమార్చి వారి దగ్గరున్నదంతా దోచుకున్నారు.

నిజం మాట్లాడిన ఆ ముని స్వర్గానికి పోలేదట. నేరుగా నరకానికి వెళ్లారు.

ఈ కథను శ్రీకృష్ణుడు చెప్పాడు.

అది విన్న అర్జునుడికి ఆశ్చర్యం వేసింది.

"ఇదేమిటి? విచిత్రంగా ఉంది. సత్యం మాట్లాడినందుకు నరకమా?" అని అడిగాడు అర్జునుడు.

"నిజం మాట్లాడినందువల్ల కలిగే మంచిని ఓ అబద్ధం ఇస్తుందా? అటువంటి సమయంలో అబద్ధమే నిజం. అలాగే అబద్ధం మాట్లాడం వల్ల కలిగే ఓ కీడు నిజం మాట్లాడటం వల్ల ఎదురవుతుంది అంటే అప్పుడు నిజమే అబద్ధం.

ఏ ధర్మమైనా సరే, అందువల్ల ఇంకొకరికి హింసకు దారి తీస్తుందంటే అది అధర్మమే.

సత్యం మాట్లాడటం వల్ల ఓ కీడు ఏర్పడుతుందనుకోండి. ఆ సమయంలో మౌనంగా ఉండటమే మంచిది. అలా కుదరకపోతే అబద్ధం చెప్పవచ్చు. అందువల్ల పాపం లేదు.

........

కొందరిళ్లల్లో చూడండి.. ఇంటి యజమానురాలు ఏదో మతిమరుపుతో కాఫీలో చక్కెరకు బదులు ఉప్పు కలిపి "ఇదిగోనండీ కాఫీ!" అని ఇవ్వడమే కాకుండా అభిప్రాయం కూడా అడుగుతుంది.

అప్పుడు ఆమె భర్త కూడా ఎంతో నేర్పుగా నువ్విచ్చిన కాఫీకి ఈ ప్రపంచంలో మరేదీ సాటి రాదనుకో!" అంటాడు. అంతేకాదు, ఆ కాఫీని ఆస్వాదిస్తూ తాగుతాడు కూడా.

నిజం చెప్పి మాటలు పడటం దేనికి అని మనసులో అనుకుని ఆ భర్త అలా మాట్లాడాడన్న మాట.

ఏది ధర్మం, ఏది అధర్మం అనే విషయంలో ఆయన గట్టివాడే. అర్జునుడికి కృష్ణుడు పాఠం చెప్పాడన్నది అందరికీ తెలిసిందే. అయితే ఆ భర్త కృష్ణుడికే పాఠం చెప్పేటట్టుగా ఉన్నాడు కదండీ!

# పంచవటి

సింగిల్ పేజీ కథ

షేక్ మహబూబ్ జాన్

పచ్చని మర్రి చెట్ల నీడలో నులివెచ్చని ఆ పంచవటి పూరిగుడిసెలో అచ్చమ్మ, సుబ్బారెడ్డిలు నివసిస్తున్నారు.

అప్పుడే భళ్లున తూర్పువాకిళ్ల తెరుచుకొని సూర్యుడు తూర్పున ఉదయించాడు. అచ్చమ్మ ఆ ఇంటిముందు కళ్లాపి చల్లి, చక్కని ముగ్గులు వేసి ఇంటిని తీర్చిదిద్ది నీళ్లబుంగ తీసుకొని గంగమ్మ వాగులో నీళ్ల కోసం వెళ్లింది. సుబ్బారెడ్డి చెట్ల కింద నులక మంచం వాల్చి, చేతిలో పొగాకుకాడ తీసుకొని మీసాలు దువ్వుకుంటూ చుట్ట చుట్టడం మొదలు పెట్టాడు.

అంతలో అటుగా పొలానికి పోతున్న కొండారెడ్డి "ఏం సుబ్బారెడ్డి మామా, పొద్దున్నే కొత్త పెళ్లికొడుకులాగా ముస్తాబై కూర్చున్నావు? ఏంటి సంగతి??" అంటూ వచ్చాడు.

"ఒరే... కొండారెడ్డీ! అంత పొలం పుట్రా వుంచుకొని నీకిదేం అడుక్కుతినే బుద్ధిరా? సంపద వుంటే సరిపోదురా.. అనుభవించాలిరా! సరేకానీ యిదిగో పొగాకు కాడ తీసుకొని కాల్చుకో" అన్నాడు సుబ్బారెడ్డి.

చుట్ట చుట్టుకుంటూ కొండారెడ్డి మామ "నాకు తెలియక అడుగుతా! ఎక్కడకు పోతున్నావేంటి?" అన్నాడు మళ్లీ.

"మొన్న మన యిస్కూలు పెద్ద పంతుగారు వచ్చి "రేపు మా యిస్కూల్లో మీటింగు వుంది. అందులో నీకు సన్మానం చేద్దామని అనుకున్నాం, నీవు తప్పకుండా రావాలి" అన్నాడు. నాకు ఆశ్చర్యమేసింది. "నేనేం చేశానని నాకు సన్మానం చేస్తున్నారని" అన్నాను. "ఈ చుట్టుపక్కల వందల సంఖ్యలో చెట్లు నాటి, పెంచి పర్యావరణానికి పాటు పడుతున్నావు. భావితరాలకు పచ్చని సంపదను అందిస్తున్నావు. అందుకు నీకు సన్మానం చేద్దామని అనుకున్నాం" అన్నాడు.

దానికి నేను "పెద్ద పంతులుగారూ, నా వంతుగా బాగా చదివిన పిల్లలకు ప్రైజులు యిస్తాను. అవి తీసుకుంటానంటే నేను వస్తానన్నాను".

"అందుకే కదా మామా నిన్ను మర్రిచెట్ల సుబ్బారెడ్డి అని పిలుస్తుంది. నీ అదృష్టం మామా! పోయిరా.. నేను పొలానికి పోతున్నానని" వెళ్లిపోయాడు కొండారెడ్డి.

అంతలోనే యిద్దరు పిల్లలు "తాతా! మా హెడ్‌మాస్టరుగారు మిమ్మల్ని వెంటనే పిలుచుకొని రమ్మని చెప్పారు. ఆ మాటలకు సుబ్బారెడ్డి లేచి నిలబడి అచ్చమ్మ మంచినీళ్ల బుంగతో ఎదురు వస్తుంటే "ఏమే నేను యిస్కూలు దాకా పోయి వస్తానని" చెప్పి పిల్లలతో బయలుదేరాడు.

దారిలో పిల్లలు "తాతా! తాతా! యింత వయసులో ఎందుకు చెట్లు నాటుతున్నావు?" అని కుతూహలంగా అడిగారు. "పిల్లలూ మీ అమ్మ, నాన్నలు ఎందుకు పెంచుతున్నారు? అన్నాడు. అందరిలాగే అన్నారు పిల్లలు.

"పిల్లలూ, మనిషై పుట్టిన తరువాత పరులకు ఉపయోగపడాలి. ప్రకృతిలో ప్రతి వస్తువు పరులకు ఉపయోగపడుతున్నాయి. కానీ మనిషి ఒక్కడే స్వార్థంతో బతుకుతున్నాడు. చెట్లు నరికేస్తున్నాడు. అందుకే సక్రమంగా సరైన సమయంలో వర్షాలు పడడం లేదు. నా వంతుగా ఈ పని చేస్తున్నాను. సరే పదండి" అంటూ పాఠశాలకు చేరుకున్నారు.

పాఠశాలలో సుబ్బారెడ్డి చేతుల మీదుగా మంచి మార్కులు వచ్చిన పిల్లలకు బహుమతులు పంచి, చివరిగా సుబ్బారెడ్డికి శాలువా కప్పి, దండ వేసి సత్కరించి రెండు మాటలు చెప్పమన్నారు.

అయ్యవార్లూ! నాకు తెలిసింది చెబుతా, మీ అందరికీ దండాలు. నేను చెప్పేదేంటంటే చెట్లు మనలాగా డబ్బులు, బట్టలు అడగవు. పెద్ద అయిన తరువాత వేరే కాపురాలు పెట్టవు. పెంచిన వారిని వెళ్లగొట్టవు, మొక్కలుగా వున్నప్పుడు నీళ్ల పోస్తే చాలు పచ్చపచ్చగా ఎదుగుతాయి, నీడనిస్తాయి, గాలినిస్తాయి, పూలు యిస్తాయి, పళ్ల యిస్తాయి. ఇంత ఉపకారం చేసే చెట్లను పెంచడంలో విశేషముంది.



కాబట్టి పిల్లల్లారా, మీరందరు మీ యిస్కూలులో మొక్కలు నాటండి, వాటిని పెంచండి. అదే నాకు అసలైన సన్మానం!" అంటూ ముగించాడు. పిల్లలందరు మర్రిచెట్ల తాతయ్యకు జై, మర్రిచెట్ల తాతయ్యకు జై... అంటూ కరతాళ ధ్వనులతో వీడ్కోలు చెప్పారు.

ఇది జరిగిన కొన్నాళ్లకు సుబ్బారెడ్డి జబ్బు పడ్డాడు. మనిషి రోజు రోజుకు క్షీణించడం మొదలు పెట్టాడు.

భర్త ఆరోగ్యం క్షీణించడంతో అచ్చమ్మ దిగులుగా తిరగసాగింది.

సుబ్బారెడ్డి తనను మర్రి చెట్ల కింద మంచంపై పడుకోబెట్టమని సైగలు చేశాడు. ఇరుగు-పొరుగు సహాయంతో ఆయనను పంచవటి కిందకు చేర్చారు. ఈ విషయం పెద్ద పంతులుకు తెలిసింది. పిల్లలు తాతను చూస్తామన్నారు. పిల్లలకు పర్మిషన్ యిచ్చి వాళ్లతో పాటు పంతుళ్లు పంచవటికి వచ్చారు. పిల్లలంతా బారులు తీరి, చేతులు జోడించి తాతను బతికించమని దేవుణ్ణి ప్రార్థించసాగారు. పెద్ద పంతులు, మిగతా పంతుళ్లు సుబ్బారెడ్డి మంచం చుట్టూ చేరి పిలుస్తున్నారు.

సుబ్బారెడ్డి కళ్లు తెరిచాడు. భార్య అచ్చమ్మ వైపు చూసాడు. అచ్చమ్మ అతని సైగలు గ్రహించి యింట్లోకి వెళ్లి ఒక కాగితం తెచ్చి పెద్ద పంతులు చేతిలో పెట్టి సుబ్బారెడ్డి కాళ్ల చెంత కూలిపోయి ప్రాణాలు వదిలింది. సుబ్బారెడ్డి ప్రాణం కూడా గాలిలో కలిసిపోయింది. జనమంతా కన్నీళ్లతో అంజలి ఘటించారు.

పెద్ద పంతులు ఆ కాగితం తీసి చదవడం మొదలు పెట్టాడు... పెద్ద పంతులుగారూ, మేం చనిపోయిన తరువాత మా యింటి వెనుకనున్న కట్టెలతో మమ్మల్ని కాల్చి, ఆ చితాభస్మం నేను ప్రాణప్రదంగా పెంచుకుంటున్న చెట్ల పాదుల్లో కలపండి. నాకు దక్కిన ఆ చారెడు పొలం అమ్మి ఆ డబ్బులతో ఏటేటా పిల్లలకు బహుమతులు యివ్వండి. ఈ పంచవటిని పిల్లలకు వినోద కేంద్రంగా మార్చండి.... సెలవు.

అది చదివి పెద్దపంతులు కన్నీటితో మర్రిచెట్ల సుబ్బారెడ్డికి శ్రద్ధాంజలి ఘటించాడు.

పిల్లలు తాతయ్య అమర్ రహే, తాతయ్య అమర్ రహే అంటూ నినదిస్తూ విచారంగా ఇంటి ముఖం పట్టారు.

చెట్లు అనాథలై దీనంగా.. మౌనంగా రోదించసాగాయి.

ఆ పంచవటిలోని పర్ణశాల దైవం లేని దేవాలయమైంది.

# రావణుని పూజించే ఆలయాలు..

షేక్ అబ్దుల్ వాహీం జాని

**"మనిషికో భక్తి మహిలో సుమతి" అన్నట్లు ఎవరి భక్తి వారిది. ఇదే కోవలో రాక్షసరాజు రావణ బ్రహ్మకు సైతం ఆలయాలు నిర్మించి పూజించే భక్తజనులు మన దేశంలోనే ఉన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు.**

రామాయణంలో రావణాసురుడు ప్రతినాయకుడిగా అందరికీ సుపరిచితమే. ఇతను పది తలలు కలిగి ఉంటాడు. రాముడు లేని సమయంలో దొంగచాటుగా సీతాదేవిని ఎత్తుకొనిపోయిన కారణంగా రావణుడికి చెడ్డపేరు వచ్చింది. అటువంటి రావణుని దేవునిగా కొలిచే ఆలయాలు ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. శ్రీరాముడు రావణాసురుని చంపి విజయం సాధించాడు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా భారతదేశంలోని అనేక ప్రాంతాలలో దసరా పండుగ సందర్భంగా రావణుని బొమ్మలను ఏర్పాటు చేసి తగలబెడుతుంటారు. అయితే మన దేశంలోని అనేక ప్రాంతాల్లో రావణాసురుడికి గుడి కట్టి పూజిస్తున్నారు. మహాయోధుడు, శివభక్తుడైన రావణాసురుని నాయకుడిగా వీరంతా భావించి పూజిస్తుంటారు. దసరా సందర్భంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ వంటి అనేక ప్రదేశాలలో అతి పెద్ద రావణుని బొమ్మలను ఏర్పాటు చేసి తగలబెడుతుంటారు. ఇటువంటి చర్యలను సైతం రావణుని భక్తులు వ్యతిరేకిస్తుంటారు. లంకాధిపతియైన రావణుని తమ నాయకునిగా పూజించే ఆలయాలు భారతదేశంలో అనేకం ఉన్నాయి.

## రావణ దేవాలయం, బిస్రఖ్, నోయిడా

బంగారు లంక రావణాసురుడి జన్మస్థలమని అనేక మంది విశ్వసిస్తారు. జానపద కథల ప్రకారం ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా సమీపంలో గౌతమ్‌బుద్ధ నగర్ చేరువలో ఉన్న బిస్రఖ్ గ్రామం రావణుడి జన్మస్థలం అని ఈ ప్రాంతవాసులు విశ్వసిస్తారు. ఇది చాలా పురాతన పట్టణం. బిస్రఖ్‌లో పౌరాణిక రాక్షస రాజు రావణుని పూజించే రావణ మందిర్ ఉంది. ఢిల్లీ నుండి ఈ ఆలయం ముప్పై కి.మీ. దూరంలో ఉంటుంది. ఈ ఆలయం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ రావణ దేవాలయాలలో ఒకటి. ఇక్కడ పది తలల రావణాసురుని విగ్రహం ఉంది. రావణునికి పది తలలు ఉండేలా ఇక్కడే మహాశివుడి నుండి వరదానం పొందినట్లు ఈ ప్రాంత వాసులు చెబుతుంటారు.

ఈ ప్రాంత ప్రజలు రావణుని దేవునిగా పూజిస్తారు. రోజూ వందల సంఖ్యలో భక్తులు దర్శిస్తుంటారు. ఈ ఆలయంలో 42 అడుగుల శివలింగం, 5.5 అడుగుల రావణుడి విగ్రహం ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఇది అత్యంత ప్రసిద్ధమైన రావణుని దేవాలయం. ఇక్కడి వారంతా లంకాధిపతి రావణుడిని దేవుడిగా గౌరవిస్తారు. రావణుడు చెడ్డవాడు అనేవారు ఉన్నారు. కానీ ఇక్కడివారు రావణుడిని దైవంగా కొలుస్తారు. రామాయణం ప్రకారం రావణుడు ప్రతినాయకుడు. కానీ ఈ ప్రాంతవాసులకు మాత్రం నాయకుడే కాదు దైవం కూడా. రావణుని పూజించడం ఇష్టంలేని కొందరు సాయుధులు ఆలయంపై దాడి చేసి రావణుని విగ్రహానికి నష్టం కలిగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. తిరిగి మరమ్మత్తులు చేయించారు. ఇక్కడ భక్తులు రావణుని పవిత్ర దేవతామూర్తిగా పూజిస్తారు. ఆయన ఇక్కడే జన్మించాడని విశ్వసిస్తారు. రావణుడు మంచి రాజని తలచే భక్తులంతా ఈ ఆలయాన్ని సందర్శించి ఆయనను తలచుకుని దుఃఖసాగరంలో మునిగిపోతారు. రావణుడి దిష్టిబొమ్మలను దహనం చేసే దసరా పండుగను ఇక్కడి ప్రజలు జరుపుకోరు. రావణుడి దిష్టిబొమ్మలను మండే అగ్నిజ్వాలల్లో కాల్చరు. నవరాత్రులు అంటే ఇక్కడి వారికి శోక కాలం. బదులుగా నవరాత్రుల తొమ్మిది రోజులు బిస్రఖ్‌లోని మహా బ్రాహ్మణుడైన రావణునికి గౌరవ సూచకంగా హోమాలు నిర్వహిస్తారు. జై బోలో లంకాపతి రావణ్‌కి జై, జై లంకేష్, జై జై లంకేష్ ఇత్యాది నినాదాలతో ఈ ప్రాంగణం మారుమోగుతుంది. భక్తులు నూతన దుస్తులు ధరించడంతో పాటు నూతన వంటకాలు తయారు చేస్తారు. రాముని శక్తిని విశ్వసించే భక్తులు ఈ ఆలయం పట్ల తమ ఆగ్రహాన్ని వ్యక్తపరుస్తుంటారు. రావణుని తండ్రి పేరు విశ్రవసుడు. తాత పేరు పులస్త్యుని. వీరిద్దరూ ఈ ప్రాంతవాసులేనని ఇక్కడి ప్రజల విశ్వాసం. రావణుని తండ్రి విశ్రవసుడి పేరుతో ఈ ప్రదేశానికి బిస్రఖ్ అనే పేరొచ్చిందని చెబుతుంటారు. ఆయన ఇక్కడ తపస్సు చేసేవారని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు.

విశ్రవసుడు గొప్ప శివభక్తుడు. ఇక్కడి ఆలయంలో విశ్రవసుడి విగ్రహానికి కూడా పూజలు జరుపుతున్నారు. ఈ ప్రాంత అడవుల్లో విశ్రవసుడు అష్టభుజి శివలింగాన్ని కనుగొని ఇక్కడ ప్రతిష్ఠించాడని ప్రజల నమ్మకం. ఇటువంటి అష్టభుజి శివలింగం మన దేశంలో బిస్రఖ్‌లో మాత్రమే ఉందని ఆలయ నిర్వాహకులు చెబుతుంటారు.



ఇప్పుడు ఇది అతి పురాతన శివాలయంగా విరాజిల్లుతోంది. భారత పురావస్తు శాఖవారు ఈ శివాలయంలో జరిపిన తవ్వకాలలో ఒక గుహతో పాటు, శివలింగాన్ని, లోహపు నాణేలను కనుగొన్నారు. ఇక్కడ కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

## దశనన్ రావణ ఆలయం

రాక్షసరాజు రావణుని కోసం నిర్మించిన ఆలయం ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఉంది. క్రీ.శ.1868లో నిర్మితమైన ఈ ఆలయం 150 సంవత్సరాల పైబడి చరిత్రను కలిగి వుంది. ఈ ఆలయం సంవత్సరానికి ఒకసారి దసరా సందర్భంగా విజయదశమి రోజున తెరుస్తుంటారు. ఆ సమయంలో వేలాది మంది రావణ భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. దీన్ని దశనన్ మందిర్, దశనన్ ఆలయం పేర్లతో పిలుస్తారు. దశనన్ అంటే రావణునికి ఉన్న పది తలలు అని చెబుతుంటారు. రావణుడి శక్తి, తెలివితేటలపై విశ్వాసం ఉన్న శివభక్తుడైన మహారాజ్ గురు ప్రసాద్ శుక్ల్ 1868లో కాన్పూర్‌లోని శివాలయం ప్రాంగణంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. 150 ఏళ్లకు పైబడి చరిత్రను కలిగివున్న ఈ ఆలయాన్ని సంవత్సరానికి ఒకసారి మాత్రమే దసరా సందర్భంగా భక్తుల కోసం తలుపులు తెరుస్తారు. ఆ సమయంలో వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ఈ ప్రాంత వాసులు రావణుని రాక్షసుడిగా భావించినప్పటికీ దేవుడిగా కొలుస్తారు, ఆరాధిస్తూ పూజలు జరుపుతారు. పాలు, పెరుగు, గంగాజలంతో రావణుని విగ్రహానికి అభిషేకం చేస్తారు. అనంతరం ఆలయాన్ని పలు రకాల పూలతో అలంకరించి హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. రావణబ్రహ్మ జ్ఞానం, తెలివి, బలం, ఔదార్యానికి ప్రతీకగా ఆయనను పూజిస్తున్నట్లు భక్తులు చెబుతుంటారు. కాన్పూర్‌లోని శివాలయం పక్కనే దశకంఠుని ఆలయం ఉంది. ఆలయంలో ఉత్సవాలు జరిగినప్పుడు ప్రజలు దీపాలు వెలిగించి, మత పరమైన ఆచారాలు పాటిస్తూ రావణుని పూలతో పూజిస్తారు.

## రావణ్‌గావ్‌లో రావణ దేవాలయం

మధ్యప్రదేశ్‌లోని విదిషా పట్టణానికి 30 కి.మీ దూరంలో వున్న నటేరన్ గ్రామం నుండి 6 కి.మీ. చేరువలో రావణ్‌గావ్ నెలకొని ఉంది. రావణుని పేరుతో ఉన్న ఈ గ్రామంలో రావణుని ఆలయం భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందింది. రావణాసురుని ఇక్కడి





ప్రజలు రావణ్‌బాబా అని పిలుస్తూ కొలుస్తారు. రావణ్‌బాబాకు ప్రథమ పూజ చేసి శుభకార్యాలు మొదలుపెడతారు. కొందరు యువత తమ చేతిపై, ఇంకొందరు ఛాతీపై రావణ్‌బాబా అని పచ్చపొట్టు పొడిపించుకున్నవారు అనేకమంది ఇక్కడ కనిపిస్తారు. కొందరైతే వ్యవసాయ ట్రాక్టర్లపై, ద్విచక్ర వాహనాలపై జై లంకేష్ అని హిందీలో రాసుకుంటారు. ఈ ఆలయంలో రావణాసురుని విగ్రహం నేలపై నిటారుగా పడుకున్న భంగిమలో ఉంటుంది. ఇక్కడి ప్రజలు తమ ఇళ్లల్లో ఎటువంటి శుభకార్యాలు జరుగుతున్నా రావణ్‌బాబాను దర్శించుకుని ఆశీస్సులు తీసుకుంటారు. ప్రతి ఏడాది విజయదశమి రోజు రావణునికి విశేష పూజలు చేస్తారు. విదిషా ప్రాంతంలో రావణ ఆరాధకుల సమితి కూడా ఉంది. రావణ్‌గామ్‌లోని ఆలయంలో శయన స్థితిలో ఉన్న లంకాధిపతి రావణుని పది అడుగుల విగ్రహం ప్రత్యేకంగా కనిపిస్తుంది. కన్యాకుబ్జ బ్రాహ్మణుల ఆలోచనకు ప్రతిరూపమే ఈ ఆలయం. రావణుడు కన్యాకుబ్జ బ్రాహ్మణ శాఖకు చెందినవాడని వీరు విశ్వసిస్తారు. ఈ గ్రామంలో దసరా ఉత్సవాలు జరుపుకోరు, ఆ సమయంలో రావణుని దిష్టిబొమ్మను దహనం చేయరు. ఈ ప్రాంతంలో సంతోషంగా జరుపుకునే వేడుకల్లో ప్రజలు ఈ ఆలయానికి వచ్చి లంకాధిపతిని పూజిస్తారు. రావణ్‌బాబా ఆలయం ముందు ఉన్న అతి పెద్ద చెరువు ఉంది. రావణాసురుడు ఉపయోగించిన అతి పెద్ద రాతి ఖడ్గం ఇందులో ఉందని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. వేసవిలో చెరువు ఎండినప్పుడు ఈ ఖడ్గం కనిపిస్తుంది. ఆ కారణంగా ఈ చెరువులోని మట్టితో పాటు నీటిని సైతం గంగాజలం అంత పవిత్రమైనవిగా భావిస్తారు.



## మందసౌర్ రావణ

మధ్యప్రదేశ్‌లోని మంద్సుర్ పురాతన ప్రదేశం. ఈ గ్రామాన్నే మందసౌర్ అని కూడా పిలుస్తారు. మందసౌర్‌ను ఒకప్పుడు వశపూర్ అని పిలిచేవారు. ఈ గ్రామం మధ్యప్రదేశ్‌లో ఉన్నప్పటికీ రాజస్థాన్ సరిహద్దుకు ఆనుకుని ఉంది.

ఆ కారణంగా రాజస్థాన్ వాసులు కూడా ఇక్కడికి వస్తుంటారు. రాజస్థాన్‌లోని బూంది పట్టణానికి చెందిన కళాకారులు రావణాసురునికి జరిగే ఉత్సవాలలో పాల్గొని బాణాసంచా కాలుస్తారు. మందసౌర్ రావణుని భార్య మండోదరి మాతృభూమి అని ఇక్కడివారి విశ్వాసం. ఈ ప్రదేశంలో కూడా ప్రసిద్ధి చెందిన రావణాసురుడి ఆలయమిది. రావణుడితో పాటు ఆలయంలో మరికొన్ని దేవతామూర్తుల విగ్రహాలు ఉన్నాయి. రావణుని భార్య మండోదరి స్వస్థలం మండ్సూర్ అని ఇక్కడి ప్రజలు విశ్వసిస్తారు. విశ్వకర్మ పుత్రుడైన మయుడు మండోదరి తండ్రి అని, ఆయన ఈ ప్రాంతాన్ని ఏలినట్లు చెబుతున్నారు. రావణుడు, మండోదరిల వివాహం మండ్సూర్‌లో జరిగిన కారణంగా ఈ ప్రాంత వాసులు రావణులు తమ ఊరి అల్లుడిగా భావిస్తారు. మధ్యప్రదేశ్‌లోని మందసౌర్, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ పట్టణాలను రావణుని అత్తమామలు నివసించిన స్థలాలుగా భావిస్తారు. రావణుడు మండోదరిని వివాహం చేసుకున్న ప్రదేశంలో ఈ ఆలయం నిర్మించారని ఇక్కడివారి విశ్వాసం. మందసౌర్‌లోని ఖాన్‌పురాలో 42 అడుగుల ఎత్తుగల పది తలల రావణాసురుడి భారీ విగ్రహం ఉంది. ప్రజలు ఈ విగ్రహానికి పూజలు చేస్తున్నారు.

## మండోర్ రావణుని ఆలయం

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు ఉత్తరాన 8 కి.మీ. దూరంలో నెలకొని ఉన్న పురాతన పట్టణం మండోర్. క్రీ.శ.1459లో మండోర్ మార్వార్ రాజధానిగా విరాజిల్లింది. ఆ తరువాత రాథోడ్ అధిపతి అయిన రావ్‌జోధా తన పాలనా కాలంలో జోధ్‌పూర్‌కు రాజధానిని మార్చాడు. ఇక్కడున్న మహాదేవ్ ఆలయ ప్రాంగణంలో రావణాసురుడికి ఒక ఆలయం నిర్మించారు. రాక్షసరాజు రావణుడు ఇక్కడ మండోదరిని వివాహం చేసుకున్నాడని అంటారు. మండోదరి మండోర్ రాకుమార్తె అని ఇక్కడివారి నమ్మకం. ఇక్కడ శ్రీమాలి బ్రాహ్మణులు ఉన్నారు. మండోదరి వివాహ వేడుకల సందర్భంగా జరిగిన ఊరేగింపులో శ్రీమాలి బ్రాహ్మణ వంశజులు కూడా పాల్గొన్నారని ఇక్కడివారు చెబుతుంటారు. వివాహం అనంతరం రావణుడు తన భార్య మండోదరితో లంకకు వెళ్లినట్లు ఇక్కడివారు చెబుతుంటారు. శ్రీమాలి బ్రాహ్మణులను రావణ వంశానికి చెందినవారుగా భావిస్తారు. 2008 చట్టం ప్రకారం శ్రీమాలి బ్రాహ్మణులు రావణుడి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. వీరు తమ వంశ మూల విరాట్ అయినా రావణుడికి గుడి 2008లో నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణం అప్పట్లో వివాదాస్పదమైంది. రాజస్థాన్‌లో ఇది ఏకైక రావణ మందిర్. ఇక్కడ 1500 కిలోల ఏక శిలారాయిలో రావణ విగ్రహాన్ని రూపొందించారు. సాధారణంగా విజయదశమినాడు చెడు అంతానికి చిహ్నంగా రావణ దహనం



జరుపుకుంటారు. అయితే జోధ్‌పూర్‌లో విజయదశమి రోజున శోకంతో రావణ దహనం జరుపుకుంటారు. దసరా వేడుకలను జరుపుకోరు. ఆ రోజున రావణాసురుడికి పిండ ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా స్నానాలు చేస్తారు. రావణ ఆలయానికి చేరువలో ఆయన భార్య మండోదరికి మరో ఆలయం నిర్మించారు. విదిషా ప్రాంత వాసులకు వివాహాల వంటి ప్రత్యేక సందర్భాలలో రావణుని ఆలయాన్ని సందర్శించడం శుభప్రదంగా భావిస్తారు. ఆలయం లోపల రావణుడితో పాటు అనేక ఇతర స్త్రీ దేవతలు కూడా ఉన్నారు. మండోర్ ప్రాంతంలో నివసించే దేవ్ బ్రాహ్మణులు రావణాసురుని ప్రత్యక్ష వారసులని కొందరు నమ్ముతారు. రావణుడు చనిపోయిన రోజున ఇక్కడివారు శ్రాద్ధ కర్మలు చేసి ఆయన ఆత్మ విముక్తి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఇక్కడ ప్రతిరోజు రావణునికి పూజలు చేస్తారు.

## కాకినాడలో రావణ దేవాలయం

ఆంధ్రప్రదేశ్‌లో అసుర చక్రవర్తి రావణుని భారీ విగ్రహం ఉన్న ఏకైక దేవాలయం తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ సముద్ర తీరానికి చేరువలో ఉంది. రావణుడు శివాలయాన్ని నిర్మించేందుకు స్వయంగా ఈ ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నట్లు ఇక్కడివారు చెబుతుంటారు. ఈ ఆలయ గోడలపై భారీ శివలింగ చిత్రం ఉంది.

రావణునికి శివునిపై ఉన్న అపార భక్తికి నిదర్శనంగా ఈ శివలింగం కనిపిస్తుంది. ఈ ఆలయ ప్రవేశ ద్వారం ముందు అతి పెద్ద తోరణం కింద భారీ రావణాసురుని విగ్రహం ఏర్పాటు చేశారు. కాకినాడ ప్రజలు రావణాసురుని శివుని వాహనంగా అభివర్ణిస్తున్నారు. ఆ పరమశివుడు రావణాసుర వాహనంపై పురవీధుల్లో ఊరేగుతుంటే భక్తులు చూసి పరవశించిపోతుంటారు. కాకినాడలోని స్వామివారు భీష్మ ఏకాదశినాడు కల్యాణం జరుపుకుని

పుర వీధుల్లో ఊరేగడం ఆనవాయితీ. ఈ స్వామివారు రావణాసుర వాహనంపై ఊరేగడం ప్రత్యేకతను సంతరించుకుంది. రావణాసుర విగ్రహానికి పది తలలు, ఇరవై చేతులు, ఆ చేతులలో రకరకాల ఆయుధాలతో భీకరంగా కనిపించే రావణాసురుని చూడడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తుంటారు. టేకుతో చేసిన ఈ రావణాసుర వాహనం బరువు రెండు టన్నులు. ఇది 300 సంవత్సరాల క్రితం తయారై వుంటుందని ఇక్కడివారి నమ్మకం. శివునిపై ఆయనకున్న భక్తిని చాటుతూ పది తలల అతిపెద్ద రావణాసురుని విగ్రహాన్ని ప్రవేశ ద్వారంలో ప్రతిష్ఠించారు. శివరాత్రి సమయంలో ఇక్కడ విశేష పూజలు జరుపుతారు. రావణుని పూజించే ఆలయాలు కొన్ని మన దేశంలో ఉంటే, మరికొన్ని శ్రీలంక, ఇండోనేషియాలోని బాలి వంటి అనేక దేశాల్లో ఉన్నాయి. శ్రీలంక వాసులు రావణుడిని భక్తి శ్రద్ధలతో పూజిస్తారు.

# వసారాలు ఎటువైపు ఉండాలి?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




కె.కామాక్షి - పరిగి

**ప్రశ్న: వసారాలు ఎటువైపు?**

**జవాబు:** వాలు వసారాలు తూర్పు, ఉత్తరాల్లో ఉండవచ్చు. తూర్పున వాలు వసారా వున్నప్పుడు పశ్చిమాన కూడా వుండవచ్చు. అలాగే ఉత్తరాన వున్నప్పుడు దక్షిణాన కూడా వుండవచ్చు. తూర్పున లేకుండా పశ్చిమాన మాత్రమే ఉండకూడదు. అలాగే ఉత్తరాన లేకుండా కేవలం దక్షిణాన వుండకూడదు. వాలు వసారాలు ఇంటిపై స్లాబు కంటే తక్కువ ఎత్తు నుండి ప్రారంభం కావాలి. వాలు వసారా ఎప్పుడూ మధ్యలో ఆగిపోకూడదు. ఏ గోడ మీదనయితే వాలు వసారాను వేస్తున్నామో ఆ గోడకు ఆ చివర నుండి ఈ చివర వరకు వేయాలి. గోడ నిడివి కంటే తగ్గించటం లేదా పొడిగించటం కూడా సరైన పద్ధతి కాదు.

## ప్రత్యామ్నాయం ?

ఎస్.మాణిక్యం - నిడదవోలు

**ప్రశ్న: మేం అద్దె ఇంట్లో ఉంటున్నాం. మా ఇల్లు వాస్తు ప్రకారం లేదు. వాస్తు ప్రకారం మార్పులు చేయించేందుకు కూడా వీలు లేకుండా వుంది. దీనికి ఇంటి యజమానులు ఒప్పుకోకపోవచ్చు. మమ్మల్ని ఏం చేయమంటారు?**

**జవాబు:** ఏ ఇల్లూ పూర్తిగా వాస్తుకు అనుగుణంగా ఉండదు. ఎక్కువ శాతం వాస్తు పరంగా వుండేట్లు జాగ్రత్త పడితే చాలు. ఎలా జాగ్రత్త పడాలో మీరు నిర్ణయించుకోవచ్చు.

## ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలంటే?

పి.భానుప్రకాశ్ - హైదరాబాద్

**ప్రశ్న: పదిహేనేళ్ల క్రితం రెండు వందల ముప్పై గజాల స్థలం కొని అందులో ఏడు గదులు నిర్మించాం. స్థలం దీర్ఘ చతురస్రాకారంగా వుంది. కొంత స్థలం ఖాళీగా ఉంది. ఇంటికి మొత్తం ఏడు తలుపులున్నాయి. మాకు, ఆ ఇంటి పక్కవాళ్లకు కలిపి ఉమ్మడి బావి ఉంది. ఈ ఇల్లు కట్టక ముందు మాకు బాగానే వుండేది. ఇందులోకి వచ్చాక చాలా ఘోరాలు జరిగిపోయాయి. ఆర్థిక పరిస్థితి, ఇంట్లోవాళ్ల ఆరోగ్య పరిస్థితి పూర్తిగా చితికిపోయాయి.**

**జవాబు:** మీ బాధను నేను చేసుకోగలను. కానీ వాస్తుకు పూర్తిగా విరుద్ధంగా వున్న ఇల్లు కట్టుకుని అందులో నివసిస్తున్న మీకు ఇలాంటి కష్టాలు కలగడంలో ఆశ్చర్యం లేదు. తూర్పు, ఉత్తర సరిహద్దులను చేరి ఎల్ ఆకారంలో ఇల్లు కట్టి పశ్చిమంలో పూర్తి ఖాళీ స్థలాన్ని వదిలేశారు. వాయవ్యంలో మట్టిని వేసి అక్కడ నైరుతి కంటే ఎత్తు పెంచారు. నైరుతి పల్లంగాను, ఖాళీగాను వుంది. ఆగ్నేయంలో తవ్విన బావి మీదుగా ఇంటి సరిహద్దు కాంపౌండు గోడ పొడిగించబడి వుంది. లెట్రిన్, బాత్‌రూంలు కట్టిన ఇంటికి దాదాపు మధ్యలో వున్నాయి. మీ ఇంటికి చాలా మార్పులు అవసరం.

సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో మార్పులు చేసే విషయం ఆలోచించవచ్చు. మీరొకసారి వ్యక్తిగతంగా వచ్చి కలవండి. మీ ఇంట్లోవాళ్లు మీ మీద ఎక్కువ ఆశలు పెట్టుకొని వున్నారు. అనవసర ఆలోచనలు తావివ్వకుండా తెలివిగా ఆలోచించండి.



## ప్లాట్‌ఫామ్ మార్చాలా?

ఎల్.ప్రసాదిని - భద్రాచలం

**ప్రశ్న: మా వంట గదిలో పొయ్యి తూర్పుకు ఎదురుగా నిలబడి వంట చేసుకునేటట్లుగా ఉంది. ఆగ్నేయ మూల డైనింగు హాలులోకి తలుపు వున్నది. ద్వారం పక్క నుంచి ఉత్తరం ఈశాన్య మూల వరకు ప్లాట్‌పాం వుంది. దాని మీద పొయ్యి వుంది. ఇంటికి వచ్చిన ఇద్దరు ముగ్గురు .. ఉత్తర ఈశాన్యం మూల వరకూ ప్లాట్‌ఫాం వుండకుండా కట్ చెయ్యాలన్నారు. నేను అంతగా పట్టించుకోలేదు. మీ అభిప్రాయ తెలుసుకుని దాని ప్రకారం చేద్దామని అనుకుంటున్నాం. సలహా చెప్పగలరు.**

**జవాబు:** ఏ గది అయినా తూర్పు ఆగ్నేయ ద్వారం వుండకూడదు. మీ ఒంట గదిలో నుండి డైనింగు హాల్లోకి వెళ్లడానికి అటువంటి ద్వారమే వుంది. వంటగదిలో ప్లాట్‌ఫాం ఆగ్నేయ మూల నుండి తూర్పు గోడకు తగలకుండా దక్షిణ గోడకు తగిలేలా వుండాలి. ఈశాన్య మూల వరకూ పొడిగించకూడదు. ఈశాన్యం వైపు ఖాళీ స్థలం వుండాలి. తూర్పుకు అభిముఖంగా నిలబడ్డప్పుడు మన ఎడమ చేతి వైపు సింక్ వుండాలి. సింక్ తర్వాత తూర్పు లేదా ఉత్తర ఈశాన్యంలో ద్వారం వుండాలి.

## వాస్తు దోషాలున్నాయా?

కె.ఫణికుమార్ - పాలకుర్తి

**ప్రశ్న: నేను గతంలో భాగస్వామ్య వ్యాపారం చేసేవాడిని. తరువాత మానేసాను. అప్పుడు బాగానే ఉండేది. నేను వుండే ఇల్లు బాగు చేయించి స్లాబ్ వేయించాను. దాని తరువాత నా పరిస్థితి మారిపోయింది. అప్పులు పెరిగిపోయాయి. ఎంత సంపాదించినా చేతిలో రూపాయి నిలవడం లేదు. ఇంట్లో ఎప్పుడూ ఎవరో ఒకరికి అనారోగ్యం. మా ఇంట్లో వాస్తు దోషాలున్నాయా?**

**జవాబు:** మీ ఇంటికి పెరిగివున్న తూర్పు ఆగ్నేయాన్ని కట్ చేసి ఇంటిని దీర్ఘ చతురస్రాకారంగా రూపొందించుకోండి. ఇంటికి ఉత్తర వాయవ్యంలో వున్న ఎంట్రన్స్ ద్వారం తీసి గోడ పెట్టండి. ఇంట్లో వాడుక నీరు ఉత్తర ఈశాన్యం గుండా బయటకి వెళ్లేలా చూడండి. ఈ మూడు మార్పుల వలన మీ పరిస్థితి బాగుపడుతుంది.

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



వాహన మరమ్మత్తులు చేస్తారు. విశాల హృదయంతో వ్యవహరిస్తారు. అందరి పట్ల సమ న్యాయం కనబరుస్తారు. మంచి వ్యక్తిగా గుర్తింపు సాధిస్తారు. శుభ కార్య ప్రయత్నాలు కలిసి వస్తాయి. పక్షులకు దాన వేయడం మంచిది. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. మిత్రులతో ఆనందంగా గడుపుతారు.

## వృషభం



రాజకీయ రంగంలోని వారికి అనుకూలం. కొనుగోళ్లు సాగిస్తారు. జీవిత భాగస్వామితో కీలక విషయాలపై చర్చలు సాగిస్తారు. సెంటిమెంట్ వస్తువుల భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించండి. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. కొత్త వ్యక్తులు పరిచయమవుతారు. దూర ప్రాంతాల నుండి శుభ వార్తలు వింటారు. పక్షులకు నీటి వసతి కల్పించండి.

## మిథునం



జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు పరిష్కార మవుతాయి. ఊహించని ఆహ్వానాలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు. కార్యాలయంలో అధికారుల మెప్పు పొందుతారు. నేర్పుగా వ్యవహరించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. భవిష్యత్తు బంగారు బాటగా కనిపిస్తుంది.

## కర్కాటం



ఊహించని అవకాశాలు లభిస్తాయి. మిత్రుల నుండి ధన లాభం పొందుతారు. వృత్తి, వ్యాపారాలకు అనుకూలంగా ఉంటుంది. ఆరోగ్యం, వాహనాల పట్ల మెలకువ అవసరం. వస్తులాభం పొందుతారు. వ్యాపార లావాదేవీలు బాగుంటాయి. పొదుపు పథకాలు ముందడుగులో ఉంటాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి.

## సింహం



ఓర్పు, నేర్పు కలిగి ఉంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. నూతన వ్యక్తులతో పరిచయాలు దీర్ఘకాలిక మిత్రత్వానికి దారి తీస్తాయి. శ్రమకు తగిన ప్రతిఫలాలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. కుక్కలకి చపాతీలు తినిపించండి. సంగీత, సాహిత్యాలపై ఆసక్తిఏర్పడుతుంది. ఆర్థిక లాభం.

## కన్య



ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. చర్చాగోష్టులలో చురుకుగా పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. నూతన వస్త్రాలు, వస్తువులు, వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. పక్షులకి నీళ్ల పెట్టండి. నిపుణుల సలహాలు పాటించి లాభపడతారు. ఆర్థికంగా బాగుంటుంది. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు.

## తుల



వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. మిత్రులు, బంధువుల నుండి శుభ వార్తలు వింటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. క్రయ, విక్రయాలలో లాభాలు పొందుతారు. కార్యాలయంలో మీ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదిస్తారు. మీ మాటతీరుతో పలువురి మెప్పు పొందుతారు. పుస్తక పఠనం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. ఆర్థికంగా బాగుంటుంది. పక్షులకి దాన వేయండి.

## వృశ్చికం



సౌందర్య సాధనాల పట్ల ఆకర్షితులవుతారు. దూర ప్రాంతాల్లోని వారితో సంభాషణలు సాగిస్తారు. బ్యాంకు లావాదేవీలు పరిశీలించుకుంటారు. హోదా పెరుగు తుంది. కొత్త కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేస్తారు. కొత్త వస్తువులు, వస్త్రాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. పూజలలో ఆరావళి కుంకుమ ఉపయోగించండి. శుభ కార్యాల్లో పాల్గొంటారు.

## ధనుస్సు



స్థిరాస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. సన్నిహితుల ద్వారా విలువైన సమాచారం అందుకుం టారు. బంధువులు, మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, ఉద్యోగాల పరంగా సందర్భోచితమైన నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. మంచి సమాచారం అందుకుంటారు. శ్రమకు అదృష్టం తోడవుతుంది. పూజలలో ఆరావళి కుంకుమ ఉపయోగించండి.

## మకరం



సంతాన పురోగతి బాగుంటుంది. క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తారు. ఆధ్యాత్మిక ప్రసంగాల పట్ల ఆకర్షితులవుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఇంటా బయటా మీదే పైచేయిగా ఉంటుంది. స్వల్ప ధన, వస్తు లాభాలు పొందుతారు. సన్నిహితులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవు తాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. అనుకోని అవకాశాలు లాభిస్తాయి. పక్షులకి నీటి వసతి కల్పించండి.

## కుంభం




ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. ఆర్థిక పరిస్థితులు మెరుగు పడతాయి. దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన కార్యక్ర మాలకు శ్రీకారం చుడతారు. ఏ పనిని చేపట్టినా విజయవంతంగా పూర్తి చేస్తారు. షేర్లు, భూముల క్రయ, విక్రయాల్లో లాభాలు పొందుతారు. మిత్ర బృందాలతో చర్చలు సాగిస్తారు.


## మీనం




ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సంఘంలో మీకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంటారు. గతంలో మీకు సానుకూలపడని వ్యవహారాలు ఇప్పుడు సానుకూలపడతాయి. పూజలలో ఆరావళి కుంకుమ ఉపయోగించండి. చేపట్టిన పనులలో ఏర్పడిన ఆటంకాలను అధిగమిస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. తగాదాలకు దూరంగా వుండడం మంచిది.

# ఈ వారం కా‘ర్టూన్స్’


నోటికొచ్చిన అంకెలు చెప్పు యాదగిరీ..!
స్వామీజీ ఎగ్జిట్ పోల్ అని వేస్తాం!!
Zakir...


రండి సార్..! పోలింగ్ స్టేషన్ కు 10 Kms ట్రాక్టర్ మీద,
మరో ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లాలి..!!
EVM
Zakir...


ఇదా..! ఫోన్ ముట్టుకుండా
ఉండడానికి!!
డా|| డాక్టర్
MD.
Zakir...







పోలండ్‌లోని ఈ కోటను మల్‌బోర్క్ కోట అంటారు. మల్‌బోర్క్ పట్టణం పేరుతోనే మల్‌బోర్క్ కోటగా పేరు గాంచింది. పదమూడో శతాబ్దంలో నిర్మించిన ఈ కోట ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందింది.

